PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 345 | విజయవాడ, శనివారం 15 జులై 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 15 July 2023 | Rs

హాస్టల్ సమస్యలపై విద్యార్థుల ఆందోళన

- ఎస్ఎఫ్ఐ నాయకులపై పోలీసు జులుం
- నలుగురు అరెస్టు, విడుదల

లోపలి పేజీలో..

నిప్పులు కక్కుకుంటూ..

నింగికెగసిన చంద్రయాన్-3



- మొదటి మూడు దశలు వంద శాతం సక్సెస్
- రాష్ట్రపతి ప్రధాని ప్రభృతుల అభినందనలు
- ఇస్రో దృష్టంతా ఆగస్టు23న సాఫ్ట్ ల్యాండింగ్‌పైనే

ప్రజాశక్తి-సూళ్లూరుపేట, బెంగళూరు

అంతరిక్ష రంగంలో భారత్ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. శుక్రవారం మధ్యాహ్నం సరిగ్గా 2.35 గంటలకు తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష పరిశోధనా కేంద్రం నుంచి చంద్రయాన్-3 ల్యాండర్‌ను మోసుకుని నిర్దిష్ట భూ కక్ష్యలోకి దూసుకెళ్లింది. మొదటి మూడు దశలను రాకెట్ నూటికి నూరు శాతం సమర్థవంతంగా అధిగమించిందని చంద్రయాన్-3 ప్రాజెక్టు డైరక్టర్ పి వీరముత్తే వేల్ తెలిపారు. అన్నీ అనుకున్న ప్రకారం జరిగితే 42 రోజుల పాటు అంతరిక్ష యాత్ర సాగించి ఆగస్టు 23న సాయంత్రం గం.5.17 ని.లకు చంద్రుని దక్షిణ ధ్రువానికి చేరువలో సుమారు 70 డిగ్రీల దక్షిణ అక్షాంశం వద్ద ల్యాండింగ్ అవుతుంది. చంద్రయాన్- 2 చివరి అంకంలో కీలకమైన ల్యాండింగ్ వద్దే కుప్పకూలింది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ సారి చంద్రయాన్-3 ల్యాండర్‌కు అమర్చిన స్టాండ్‌ను శక్తివంతమైన రాడ్స్‌తో తయారు చేశారు. ఇస్రో దృష్టంతా ఇప్పుడు చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్ పైనే ఉంది. ఈ ఆఖరి ఘట్టం విజయవంతమైతే చంద్రమండలంపైకి రోవర్‌ను పంపిన అమెరికా, రష్యా, చైనాల సరసన మిగతా 5లో



వ్యవసాయ, ఉద్యానవన శాఖ సమీక్షలో మాట్లాడుతున్న సిఎం జగన్‌మోహన్ రెడ్డి

వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ

- ఆర్‌బికెలలో భూసార పరీక్షలు
- టమోటా, ఉల్లిసాగుపై ప్రత్యేక దృష్టి
- వ్యవసాయ, ఉద్యాన శాఖల సమీక్షలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ వినియోగాన్ని విస్తృతంగా పెంచాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పంటల సస్యరక్షణకోసం పురుగు మందుల పిచికారి, దిగుబడుల అంచనాలను రూపొందించేందుకు ఇప్పటికే డ్రోన్ టెక్నాలజీని వాడుతున్నామని తెలిపారు. భూసార పరీక్షలను కూడా డ్రోన్‌ల సహాయంతో చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులకు గురయ్యే టమోటా, ఉల్లి లాంటి పంటల సాగు, ప్రాసెసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖలపై సిఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో అధికారులు ఖరీఫ్ సన్నద్ధతతోపాటు వ్యవసాయ అనుబంధశాఖల్లో చేపడుతున్న కార్యక్రమాల ప్రగతిని సిఎంకు వివరించారు. క్రాపింగ్‌లో జియో ఫెన్సింగ్ ఫీచర్‌ను కొత్తగా ప్రవేశపెట్టామని తెలిపారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది ఈ క్రాపింగ్‌ను ముందుగానే మొదలు పెట్టామని వివరించారు. ఈ క్రాపింగ్‌ను డేటాను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 10 వేల డ్రోన్లు తీసుకువచ్చి అన్ని ఆర్‌బికెలలో రైతులకు అందుబాటులో వుంచాలని ఆదేశించారు. డ్రోన్ల ద్వారా చేసే భూసార పరీక్షలను ఎప్పటికప్పుడు తెలుసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం బహుళ ప్రయోజనకారిగా ఉంటుందన్నారు. జగనన్న సురక్షా కార్యక్రమంలో కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులను ఇచ్చి రైతు భరోసా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమాకు అర్హులను చేయాలన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి పంట బీమా పరిహారాన్ని అక్టోబరులో ఇచ్చేందుకు సిద్ధమవుతున్నామని తెలిపారు. ఈ ప్రభుత్వం వచ్చాక 54.48 లక్షల మంది రైతులకు రూ.7,802.5 కోట్లు నష్టపరిహారంగా అందించామని అధికారులు సిఎంకు వివరించారు. డ్రోన్ల విషయంలో భద్రత, సమర్థవంతమైన నిర్వహణ, సర్వీసు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నామని వివరించారు. డిజిసిఎ నిబంధనలను పాటిస్తున్నామని, రైతులకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ నాలుగేళ్లలో 4.34 లక్షల ఎకరాల్లో సాగుచేస్తున్న రైతులు ఉద్యానవన పంటలవైపు మళ్లారని వివరించారు. రెగ్యులర్ మార్కెట్‌కే కాకుండా ఫుడ్ ప్రాసెసింగ్‌కు అనుకూలమైన వంగడాలను ఉద్యానవన పంటల్లో ప్రోత్సహించాలని ఈ సందర్భంగా సిఎం అధికారులను ఆదేశించారు. గోడౌన్లు, కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూమ్స్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల్లో నకిలీలు, కల్తీ లేకుండా నివారించ డంలో ఆర్‌బికెలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. మార్కెటింగ్‌లో కూడా మధ్యదళారుల పాత్రలేకుండా ఆర్‌బికెల ప్రమేయాన్ని తీసుకురావాల న్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, ఎపి అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి, వ్యవసాయశాఖ సలహాదారు తిరుపాల్‌రెడ్డి, సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి, వ్యవసాయశాఖ స్పెషల్ సిఎస్ గోపాలకృష్ణ ద్వివేది తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్, అక్టోబర్‌ల్లో

రాజకీయ ప్రచారోద్యమం

- అన్యాక్రాంతమైన అసైన్డు భూములను పంచాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ నిర్ణయం
- మీడియాకు వెల్లడించిన రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు



ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

బిజెపి మతోన్మాద విధానాలు, ప్రాంతీయ పార్టీల అవకాశవాద రాజకీయాలపై సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో రాజకీయ ప్రచారోద్యమాన్ని చేపట్టాలని నిర్ణయించినట్టు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. అనంతపురంలో రెండు రోజులపాటు జరిగిన సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ నిర్ణయాలను ఆయన మీడియాకు తెలియజేశారు. విభజన సమయంలో రాష్ట్రానికిచ్చిన ఏ హామీనీ బిజెపి అమలు చేయలేదని తెలిపారు. రాష్ట్రానికి ఇంతటి ద్రోహం చేసిన బిజెపికి ఇక్కడి ప్రధాన రాజకీయ పార్టీలు భజన చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రాన్ని బిజెపికి మిగతా 2లో

టమాటా కిలో రూ.10కే ఇవ్వాలి

నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో ప్రజల కోసం ప్రభుత్వం టమాటాను కిలో రూ.10కే ఇవ్వాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రస్తుతం కిలో టమోటా ధర రూ.150 వరకూ ఉందన్నారు. ధరల స్థిరీకరణ నిధిని ఉపయోగించి రైతుల నుంచి టమాటాను ప్రభుత్వమే కొనుగోలు చేసి కిలో పది రూపాయలకే ఇంటింటికి రేషన్ వాహనాల ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బియ్యం తరువాత ప్రజలు అత్యధికంగా వాడేది టమాటాలనేనని తెలిపారు. చింతపండు, మిరప ధరలు ఇదే రకంగా పెరిగాయన్నారు. ఈ మూడింటినీ సబ్సిడీతో ప్రజలకు ఇవ్వాలని కోరారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ట్రేడ్ యూనియన్, మహిళా సంఘాలు చేపట్టిన ఆందోళనకు సిపిఎం మద్దతునిస్తుందని తెలిపారు. నిత్యావసర ధరలతోపాటు, విద్యుత్ ఛార్జీల పెరుగుదలపైనా వామపక్షాలతో కలిసి ఉద్యమాన్ని చేపడతామని చెప్పారు.

పోలవరం నిర్వాసితుల సమస్యపై ఢిల్లీలో ధర్నా

పోలవరం అంటే డ్యామ్ మాత్రమే కాదని, పోలవరం అంటే నిర్వాసితులు... పోలవరం అంటే గిరిజనులు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇది లక్షలాది మంది సమస్యని తెలిపారు. పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో 400 కిలోమీటర్లు పాదయాత్ర చేశామని గుర్తు చేశారు. దీని తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గంలో చర్చించిందని, అయితే పరిష్కారం రాలేదని తెలిపారు. పునరావాసానికి రూ.12 వేల కోట్లు ఇవ్వబోమని కేంద్రం ఇదివరకే చెప్పిందన్నారు. కేంద్రమివ్వకపోతే పోరాడి తీసుకురావాలి లేదా రాష్ట్రమైన భరించాలని డిమాండ్ చేశారు. పునరావాసంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడాలని సిపిఎం నిర్ణయించిందని తెలిపారు. జులై 20 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు జరిగే వర్షాకాల పార్లమెంట్ సమావేశాల సమయంలో ఢిల్లీవెళ్లి జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. రూ.33 వేల కోట్ల నిధులివ్వాలని పోరాటాన్ని సాగిస్తామని తెలిపారు.

'ఉక్కు'పై కేంద్రం కక్ష సాధింపు!

అదానీ పోర్టు ద్వారా స్టీల్‌ప్లాంట్‌కు బొగ్గు రాకుండా అడ్డుకుంటున్న వైనం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ప్రయత్నాలకు తాజాగా అదానీ గంగవరం పోర్టు అడ్డాగా మారింది. ఉక్కు కర్మాగారాన్ని అమ్మడానికి వీల్లేదని, ప్రయివేటీకరణ కాకుండా అడ్డుకుని తీరుతామని 883 రోజులుగా స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ప్రజానీకం పోరాడుతున్నా మోడీ సర్కారు చెవికెక్కడం లేదు. పైపెచ్చు ఈ ఉద్యమాన్ని దొంగదెబ్బ తీసేందుకు కేంద్ర పాలకులు స్టీల్‌ప్లాంట్‌కు రావాల్సిన రా మెటీరియల్‌ను పలు రకాలుగా అడ్డుకుంటున్నారు. అదానీ గంగవరం పోర్టు నుంచి రా మెటీరియల్ సరఫరా కావాల్సి ఉండగా, ఆ ప్రయివేట్ పోర్టును కేంద్రం అడ్డం పెట్టుకొని స్టీల్‌ప్లాంట్‌ను దిగ్బంధించాలని చూస్తోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గంగవరం పోర్టు ద్వారా దిగుమతి అయ్యే బొగ్గును అన్‌లోడింగ్ చేయకుండా బెర్త్ మీదనే వదిలేసే నిర్ణయం తీసుకుంది. దీంతో, స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెల 13న 15 వేల టన్నుల ఉత్పత్తి చేయాల్సి ఉండగా, కేవలం 12 వేల టన్నులకే పరిమితమైంది. విదేశాల నుంచి స్టీల్‌ప్లాంట్ దిగుమతి చేసుకున్న రెండు బొగ్గు వెస్సెల్స్ (ఓడలు)ను అదానీ గంగవరం పోర్టు తాజాగా బెర్తు మీదనే నిలిపేసింది.



వీటిల్లో కొకింగ్ కోల్ ప్రధానంగా ఉన్నట్లు తెలుస్తోంది. గతం నుంచీ స్టీల్‌ప్లాంట్ ఈ పోర్టు నుంచి కొకింగ్ కోల్, ఇతర రా మెటీరియల్‌ను దిగుమతి చేసుకుంటోంది. కేంద్రం తీసుకున్న వ్యూహాత్మక అమ్మకం నిర్ణయంతో గడిచిన కొద్ది నెలలుగా స్టీల్‌ప్లాంట్ ఆర్థిక పరిస్థితి దినదినగండంగా మారింది. ఈ నేపథ్యంలో రూ.50 కోట్లు కార్గో హ్యాండ్లింగ్ ఛార్జీలను ఈ పోర్టుకు స్టీల్‌ప్లాంట్ బకాయి పడింది. బకాయి చెల్లించాకే నౌకల నుంచి బొగ్గును తీసుకెళ్లాలంటూ స్టీల్‌ప్లాంట్‌కు షరతు పెట్టింది. హాట్ మెటల్ (స్టీల్) ఉత్పత్తికి కొకింగ్ కోల్ కీలకమైనది. రష్యా నుంచి ఒక నౌకలో 75 వేల టన్నుల కొకింగ్ కోల్ ఈ పోర్టుకు చేరుకుంది. ఆస్ట్రేలియా నుంచి కూడా ఈ పోర్టుకు అదే స్థాయిలో కొకింగ్ కోల్ వచ్చింది. ఇదంతా స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లాల్సి ఉన్నా పోర్టు యాజమాన్యం అడ్డుకుంది.

1200 ఎకరాల ప్లాంట్ భూమి తీసుకున్న గంగవరం పోర్టు

2000 దశకంలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ నుంచి గంగవరం ప్రయివేట్ పోర్టు కోసం నాటి టిడిపి ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి 1200 ఎకరాల భూమిని తీసుకుంది. పోర్టు ఏర్పాటు కోసం ఇచ్చిన భూమికి వాటా కింద పోర్టులో ఓ బెర్తు ఇవ్వాలన్న డిమాండ్‌ను స్టీల్‌ప్లాంట్ ఆనాడే చేసినా నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒత్తిడి చేసి ఎస్.రాయవరం వద్ద భూమికి భూమి ఇచ్చారు. ఆనాడే బెర్తు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని స్టీల్‌ప్లాంట్ కార్మికులు తాజాగా ఆవేదన చెందుతున్నారు. నాడు చంద్రబాబు భూమికి భూమి పేరుతో స్టీల్‌ప్లాంట్‌కు ఇచ్చిన భూమి ఎందుకూ పనికిరాదని, స్టీల్‌ప్లాంట్‌కు తన వాటాగా గంగవరం పోర్టు నుంచి బెర్తును తీసుకుని ఉంటే ఈ రోజు ఈ సమస్య తలెత్తేది కాదని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు కెఎం.శ్రీనివాస్ 'ప్రజాశక్తి'కి తెలిపారు.

బ్యాంకింగ్ కరస్పాండెంట్లుగా రేషన్ డీలర్లు!

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రేషన్ షాపు డీలర్లకు బ్యాంకింగ్ (బిజినెస్) కరస్పాండెంట్లుగా అదనపు బాధ్యతలు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఈ నిర్ణయం వల్ల రేషన్ షాపు డీలర్ల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. మార్చి నెలలో కేంద్ర ప్రభుత్వం నుండి అందిన సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం ఇచ్చే అనేక పథకాలను బ్యాంకుల ద్వారానే అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ పథకాలకు లబ్ధిదారులను సక్రమంగా గుర్తించి, ఆ జాబితాను బ్యాంకర్లకు అందించే బాధ్యతతో పాటు, లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించే బాధ్యతను కూడా రేషన్ డీలర్లుకు అప్పగించాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ద్వారా ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన సాంకేతిక అవగాహన పెంచేందుకుగా డిఎఫ్‌పిడి ద్వారా శిక్షణ ఇవ్వాలని కూడా నిర్ణయించినట్లు తెలిసింది. ఇదే అంశంపై రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి కూడా తాజాగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపింది.

మణిపూర్‌లో హింసను ఆపండి

- భారత్‌ను కోరుతూ ఇయు పార్లమెంట్ తీర్మానం
- తోసిపుచ్చిన భారత్



మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ పారిస్‌లో నిరసన తెలుపుతున్న దృశ్యం

స్ట్రాస్‌బర్గ్ (ఫ్రాన్స్) : మణిపూర్‌లో హింసను ఆపేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని, అక్కడి మతపరమైన మైనారిటీలకు రక్షించాలని భారత ప్రభుత్వాన్ని యురోపియన్ పార్లమెంట్ కోరింది. ఈ మేరకు గురువారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. బుధవారం సాయంత్రం ఈ అంశంపై చర్చ జరిగింది. పారిస్‌లో రెండు రోజుల అధికార పర్యటన నిమిత్తం భారత ప్రధాని మోడీ రావడానికి కాస్త ముందుగా ఈ తీర్మానం వెలువడింది. కాగా భారత ప్రభుత్వం వెంటనే దీనిపై ఘాటుగా స్పందించింది. ఇయు పార్లమెంట్ చర్య అమోదయోగ్యం కానిదని స్పష్టం చేసింది. "మణిపూర్ క్రిస్టియన్ కమ్యూనిటీ వంటి మతపరమైన మైనారిటీలను కాపాడేందుకు, తదుపరి హింస చెలరేగకుండా నివారించేందుకు" భారత ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ తీర్మానం పేర్కొంది. మణిపూర్‌లో హింస చోటు చేసు కుంటున్న ప్రాంతాలకు జర్నలిస్టులు, అంతర్జాతీయ పరిశీలకులు వెళ్లేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అధికారులను కోరింది. మణిపూర్‌లో ఇంటర్‌నెట్‌పై నిషేధాన్ని ఎత్తివేయాలని కోరింది. ఐక్యరాజ్య సమితి సిఫార్సులకు అనుగుణంగా సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టాన్ని రద్దు చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని తీర్మానం కోరింది. భారత్‌తో జరిపే చర్చల్లో మానవ హక్కుల ప్రాముఖ్యత గురించి ప్రముఖంగా ప్రస్తావించాల్సిందిగా ఇయు పార్లమెంట్‌స సభ్యులు ఇయుని కోరారు. కేవలం మణిపూర్‌లోనే కాకుండా మొత్తంగా భారతదేశంలో మైనారిటీల పరిస్థితి పట్ల పార్లమెంట్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

భారత్ ఖండన

ఈ తీర్మానంపై భారత్ అసహనం వ్యక్తం చేసింది. ఇది ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాని చర్య అంటూ విదేశాంగ శాఖ ప్రతినిధి అరిందమ్ బగ్చి ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు.

ఈ చర్య వలసవాద వైఖరిని ప్రతిబింబిస్తోందని అన్నారు. మణిపూర్‌లో పరిస్థితులపై న్యాయ వ్యవస్థతో సహా అన్ని స్థాయిలో అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని, ఇతరుల అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి బదులుగా వారి స్వంత విషయాలపై దృష్టి పెడితే బాగుంటుందని యురోపియన్ పార్లమెంట్‌కు సూచించారు.

ఆగస్టు 14న కోర్టుకు హాజరుకండి

- అవినాష్ రెడ్డికి సిబిఐ కోర్టు సమన్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడుగా ఉన్న కడప ఎంపి అవినాష్‌రెడ్డికి సిబిఐ కోర్టు సమన్లు జారీచేసింది. ఆగస్టు 14న కోర్టులో హాజరు కావాలని ఆదేశించింది. శుక్రవారం సిబిఐ కోర్టులో వివేకా హత్య కేసు విచారణ జరిగింది. ఈ కేసులో అవినాష్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిలను నిందితులుగా చేరుస్తూ ఇటీవల సిబిఐ దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్‌ను సిబిఐ కోర్టు పరిగణనలోకి తీసుకుంది. వివేకా హత్యకేసులో ఎంపి అవినాష్‌రెడ్డిని సిబిఐ ఎనిమిదో నిందితుడిగా చేర్చింది. ఈ కేసులో ఆరు, ఏడో నిందితులుగా భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. శుక్రవారం నాటి విచారణకు చంచల్‌గూడ జైల్లో ఉన్న నిందితులందరూ హాజరయ్యారు. వారందరికీ ఆగస్టు 14 వరకు కోర్టు రిమాండ్ పొడిగించింది.

ఇసుక తవ్వకాలపై నిషేధం సమర్థనీయమే

- ఎన్‌జిటి తీర్పుపై స్టే కుదరదు
- సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఎదురుదెబ్బ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇసుక తవ్వకాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అడ్డగోలుగా సాగుతున్న ఇసుక తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలంటూ గతంలో జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) జారీ చేసిన ఉత్తర్వులను సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. ఎన్‌జిటి ఉత్తర్వులపై స్టే ఇవ్వడం కుదరదని స్పష్టం చేసింది. గత మార్చి 23న ఇసుక తవ్వకాలపై ఎన్‌జిటి నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీనిని సవాలు చేస్తూ ఏపి ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ సంజయ్ కరోల్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఎన్‌జిటి తీర్పుపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది.రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ఇసుక తవ్వకాలను గంపగుత్తగా జయప్రకాశ్ పవర్ వెంచర్స్ లిమిటెడ్ పరం చేసిందన్న ఆరోపణలున్నాయి. పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలను చేపడుతున్నారని పలువురు పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఏపి ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టిన ఎన్‌జిటి, ఇసుక తవ్వాలపై నిషేధం విధించింది. ఈ తీర్పును సమర్థించిన ధర్మాసనం.. ఎన్జీటి తీర్పును యథాతథంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అడ్డగోలు ఇసుక తవ్వకాలకు అనుమతించినందుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఎన్‌జిటి విధించిన రూ.18 కోట్ల జరిమానాను నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. ఈ కేసులో ప్రతివాదులైన నాగేంద్ర కుమార్, హేమ కుమార్‌లకు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది.

ఎన్‌జిటి తీర్పులో ఏముందంటే..

ఇసుక తవ్వకాలపై ఆంక్షలు విధిస్తూ ఎన్‌జిటి ఇచ్చిన తీర్పులో పలు కీలకాంశాలున్నాయి. ప్రధానంగా బి2 కేటగిరీ ఇసుక రీచ్‌లలో పాక్షికంగా యంత్రాలతో ఇసుక త్వవకానికి అనుమతి ఇవ్వడం చట్ట విరుద్ధమని ఎన్‌జిటి పేర్కొంది. బి1, బి2 కేటగిరీల కింద ఇసుక తవ్వకాల కోసం ఇప్పటికే ఇచ్చిన అన్ని రకాల పర్యావరణ అనుమతులను రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ పునఃపరిశీలన చేయాలని నిర్దేశించింది. రాష్ట్రంలో ఇసుక రీచ్‌ల పరిధిలో పర్యావరణ విధ్వంసం పరిశీలన, అంచనా కోసం ఒక నిపుణుల కమిటీని కూడా నియమించింది. ఇసుక తవ్వకాలతో పర్యావరణానికి జరిగిన నష్టాన్ని గుర్తించాలని ఈ కమిటీని ఆదేశించింది. రివర్ బెడ్లు, నదీ తీరాల్లో భారీ యంత్రాలతో మైనింగ్ చేసుకోవచ్చంటూ అనుమతివ్వడంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పర్యావరణ శాఖ కార్యదర్శిని ఆదేశించింది.

జీడి రైతుల గోడు పట్టదా?

- రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలి
- జీపుజాతాలో రైతు, జీడి రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కవిటి (శ్రీకాకుళం జిల్లా)

మద్దతు ధరలేక ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న జీడి రైతుల గోడు పట్టదా? అని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీడికి మద్దతు ధర కల్పించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన జీపు జాతా శ్రీకాకుళం జిల్లా కవిటి మండల కేంద్రంలో శుక్రవారం ప్రారంభమైంది. రైతు సంఘం సీనియర్ నాయకులు పాతిన కృష్ణమూర్తి జెండా ఊపి జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో రూ.14 వేలు పైబడి పలికిన 80 కిలోల జీడి పిక్కల బస్తా ధర నేడు రూ.7,500 నుంచి రూ.ఎనిమిది వేలకు దిగజారిందన్నారు. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న కేంద్రం, రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం జీడికి ఎందుకు మద్దతు ధర ప్రకటించడం లేదని ప్రశ్నించారు. 80 కిలోల జీడి పిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించాలని, రాష్ట్రంలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జీడి పంట విస్తరణ, నిర్వహణకు గతంలో ఇచ్చిన రాయితీలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తొలిరోజు జీపుజాతా కవిటి, సోంపేట మండలాల్లో సాగింది. జాతాలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సంగారు లక్ష్మీనారాయణ, సింహాచలం, టి.పాపారావు, బత్తిన.లక్ష్మీనారాయణ, కొబ్బరి రైతు సంఘం అధ్యక్షులు బల్లెడ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



జీపుజాతాను ప్రారంభిస్తున్న రైతుసంఘం నాయకులు కృష్ణమూర్తి

అక్రమ లాకౌట్‌ను వెంటనే ఎత్తేయాలి : సిఐటియు

జీడి పరిశ్రమల అక్రమ లాకౌట్‌ను వెంటనే ఎత్తేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. జీడి పరిశ్రమల అక్రమ లాకౌట్‌ను ఎత్తివేయాలని, కార్మికులందరికీ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ జీడి కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన మందస మండల కేంద్రంలోని సిఐటియు కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ బి.పాపారావుకు వినతిపత్రం అందజేశారు.

అసైన్డ్ హక్కులను కల్పించడం సాహసోపేతం

- జూపూడి ప్రభాకర్‌రావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పేదల చేతుల్లో వున్న అసైన్డ్ భూములకు హక్కులను కల్పించడం సాహసోపేతమైన నిర్ణయమని సామాజిక న్యాయ ప్రభుత్వ సలహాదారులు జూపూడి ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్రకార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పేదవర్గాలకు ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో 20 ఏళ్లకు పైబడి అనుభవ సాగులో ఉంటే అలాంటి రైతులకు తమ భూములపై సర్వహక్కుల్ని కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అసైన్డ్ భూముల్ని నిషేధిత జాబితా 22(ఏ)లో పెట్టడం జరిగిందని దీంతో రైతులకు అనాదిగా పంటలు పండిస్తున్నా ఎలాంటి హక్కులు ఉండేవికావన్నారు. అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ నిర్ణయం లక్షలాది మంది నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని అన్నారు. అసైన్డ్ భూములను సాగు చేసే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, పేద రైతులకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా భారీ లాభం చేకూరుతుందని అన్నారు.

వరంగల్ రైల్వేస్టేషన్‌లో 'కూలిన వాటర్ ట్యాంక్'

- ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ రైల్వే స్టేషన్‌లో వాటర్ ట్యాంక్ కూలి ప్రయాణికులపై పడటంతో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుల బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో వరంగల్ రైల్వే స్టేషన్ ఒకటవ ప్లాట్‌ఫామ్ షెడ్డుపైనున్న వాటర్‌ట్యాంక్ ఒక్కసారిగా కూలింది. దీంతో ప్రయాణికులు రైలు పట్టాల మీదికి పరుగులు తీశారు. ఐదుగురి ప్రయాణికులకి తీవ్రగాయాలు అయ్యాయి. వారిని ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు. బాధితులను వరంగల్ నగరంలోని 16వ డివిజన్ కీర్తినగర్‌కు చెందిన నమిండ్ల శకుంతల, నమిండ్ల కిషన్‌రావు, వరంగల్‌కు చెందిన రమాదేవి, రామబ్రహ్మం, వారి కుమారుడు హరీష్‌గా గుర్తించారు. శకుంతలకు స్వల్ప గాయాలు కాగా కిషన్‌రావుకు తొడ ఎముక విరిగింది. రమాదేవి, రామబ్రహ్మం, హరీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని మెరుగైన వైద్యం కోసం హన్మకొండలోని రోహిణి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. వైద్య సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. వాటర్ ట్యాంక్ పడిపోవడానికి కారణాలపై రైల్వే సిబ్బంది ఆరా తీస్తున్నారు. సంఘటనా స్థలాన్ని డిఆర్‌ఎం పరిశీలించి ప్రమాదం జరిగిన తీరుపై వివరాలు సేకరించారు.

ఆ కేసుల గురించి చెప్పకపోతే అక్రమాలకు పాల్పడినట్లే

- మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులురెడ్డిపై చర్యలకు రాష్ట్రపతికి ఫైళ్లు పంపాలి : హైకోర్టు తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

ఎన్నికల అఫిడవిట్‌లో తమపై ఉన్న క్రిమినల్ కేసుల గురించి వివరించకపోవడం ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడినట్లే అవుతుందని హైకోర్టు కీలక తీర్పు చెప్పింది. ఇది అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లుగా పరిగణించడమే అవుతుందని జస్టిస్ డివిఎస్‌-ఎస్ సోమయాజులు తీర్పునిచ్చారు. నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2011, 2017 ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా యండపల్లి శ్రీనివాసులురెడ్డి గెలుపొందారు. 2011లో నమోదైన క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొనలేదంటూ ఆయన చేతిలో ఓడిపోయిన టిడిపి అభ్యర్థి వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి 2017లో దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. 'క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని గోప్యంగా ఉంచినందున ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 125-ఎ కింద శ్రీనివాస్‌రెడ్డి ప్రాసిక్యూషన్‌కు అర్హుడు. ఆ చట్టంలోని సెక్షన్ 8ఎ ప్రకారం చర్యలు తీసుకునేలా రాష్ట్రపతికి సంబంధిత ఫైళ్లను శాసనమండలి కార్యదర్శి నివేదించాలి' అని హైకోర్టు పేర్కొంది.



కోటేశ్వరరావు పాడె మోస్తూ అంతిమయాత్రలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

ఆర్‌కెకు కన్నీటి వీడ్కోలు

- ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి-విజయవాడ

సిపిఎం విజయవాడ నగర సీనియర్ నాయకులు, కార్మిక నేత, ఎపిఎస్‌ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ ఉమ్మడి కృష్ణాజిల్లా పూర్వ కార్యదర్శి రాజమహేంద్రవరపు కోటేశ్వరరావు (ఆర్‌కె) అంత్యక్రియలు శుక్రవారం ముగిశాయి. సిపిఎం శ్రేణులు, సిఐటియు, పలు కార్మిక, ఉద్యోగ, ప్రజా, యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలు, ఆర్‌కె కుటుంబ సభ్యులు, బంధువుల అశ్రునయనాల మధ్య నగరంలోని దుర్గాపురం రజకవీధిలోని ఆయన స్వగృహం నుండి అంతిమ యాత్ర సాగింది. విజయవాడ కృష్ణలంక స్వర్గపురిలో అంతిమ సంస్కారాలు నిర్వహిం చారు. తొలుత ఆర్‌కె భౌతికకాయంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, పలువురు ఎస్‌డబ్ల్యుఎఫ్, సిఐటియు నేతలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాబురావుతోపాటు సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు, తూర్పు సిటీ నాయకులు పి.కృష్ణ, సిఐటియు నాయకులు కెఆర్‌కె.మూర్తి, ఎం.వి.సుధాకర్ తదితరులు ఆయన పాడె మోశారు.

ఆర్‌కె మృతికి సంతాప సూచికగా నల్లబ్యాడ్జీలు ధరించి "జోహార్ ఆర్‌కె, సాధిస్తాం...సాధిస్తాం ఆర్‌కె ఆశయాలను" అని నినదిస్తూ అంతిమయాత్రలో పాల్గొన్నారు. అంతిమయాత్ర అనంతరం స్వర్గపురిలో సంతాప సభ నిర్వహించారు. ఎస్‌డబ్ల్యుఎఫ్, సిఐటియు, సిపిఎం ఉద్యమాల్లో కోటేశ్వరరావు నిర్వర్తించిన పోరాటాల స్ఫూర్తిని నేతలు వివరించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్, నాయకులు ముజఫర్ అహ్మద్, ఆర్‌వి.నరసింహారావు, బార్ కౌన్సిల్ సభ్యులు, ఐలు రాష్ట్ర నాయకులు సుంకర రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బిఎస్ రావు భౌతికకాయానికి పలువురు నివాళి

- నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ బి.ఎస్.రావు భౌతికకాయాన్ని టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సందర్శించి నివాళులర్పించారు. భౌతికకాయాన్ని గురువారం అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి విజయవాడ సమీపంలోని తాడిగడపలో గల శ్రీ చైతన్య విద్యా సంస్థల ప్రాంగణానికి తీసుకువచ్చారు. శుక్రవారం పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, విద్యావేత్తలు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. నాలెడ్జ్ ఎకానమీలో ప్రపంచానికి భారత్ ఆదర్శంగా నిలుస్తోందని, దీనికి నాంది పలికింది బి.ఎస్.రావేనని కొనియాడారు. ఐఐటిల్లో తెలుగు వారికి 25 శాతం సీట్లు రావడానికి ప్రధాన కారణం ఆయన కృషేనన్నారు. టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్, మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహనరావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. శనివారం ఉదయం 10 గంటలకు తాడిగడప శ్రీ చైతన్య మెయిన్ క్యాంపస్ నుండి అంతిమయాత్ర ప్రారంభమవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

డిగ్రీ ప్రవేశాల గడువు మరోసారి పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిగ్రీ ప్రవేశాల గడువును మరోసారి ఉన్నత విద్యామండలి పొడిగించింది. డిగ్రీ ఫీజులను ఖరారు చేయడంలో ఆలస్యం కావడంతో రెండుసార్లు ఉన్నత విద్యామండలి పొడిగించింది. ఎట్టకేలకు ఫీజులను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఈ నెల 12న విడుదల చేసిన జిఒపై ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు కోర్టును ఆశ్రయించాయి. దీంతో ఈ నెల 12వ తేదితో ముగిసిన రిజిస్ట్రేషన్ గడువును 17వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఉన్నత విద్యామండలి తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఈ నెల 20 నుంచి ప్రారంభమవుతుందని తెలిపింది.

మహిళల జీవితాల్లో మార్పు కోసం 'మహాశక్తి'

- అవినీతి ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి
- చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళల స్థితిగతులను, జీవితాలను మార్చడానికి నాంది మహాశక్తి అని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. అన్ని సమస్యలకు పరిష్కారం మహాశక్తి సంకల్పమని చెప్పారు. టిడిపి ప్రకటించిన తొలిదశ మేనిఫెస్టో 'మహాశక్తి' పథకాలపై టిడిపి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఆడబిడ్డలను మహాశక్తిగా తయారు చేయాలన్నది తన సంకల్పమని, వచ్చే ఎన్నికల్లో మహిళా శక్తి ఏంటో జగన్‌కు చూపించాలని అన్నారు. 2.50 కోట్ల మంది మహిళలు ముందుకొచ్చి అవినీతి ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. టిడిపి ఆవిర్భావం నుంచి మహిళా సాధికారతకు పెద్దపీట వేసిందని చెప్పారు. మహిళా సంక్షేమానికి అనేక కార్యక్రమాలు తీసుకొచ్చానని చెప్పారు. మహాశక్తి మేనిఫెస్టోలో పొందుపరిచిన పథకాలను చంద్రబాబు వివరించారు. జగన్ తన అసమర్థతతో రాష్ట్రాన్ని నాశనం చేశారని, ఎక్కడ చూసినా గంజాయే అని అన్నారు. మహిళలకు రక్షణ లేదని, ఏ సైకో ఎటునుంచి దాడి చేస్తారోననే భయం మహిళల్లో ఉందని చెప్పారు. పోలీస్ వ్యవస్థ ఏమయ్యిందని ప్రశ్నించారు. నాలుగేళ్లల్లో మహిళలపై 52,587 దాడులు, వేధింపుల ఘటనలు జరిగాయని తెలిపారు. 22,278 మంది ఆడబిడ్డలు కనిపించకుండా పోయారని కేంద్రం చెబుతుందని తెలిపారు. 3,372 అత్యాచారాలు, 41 సామూహిక అత్యాచారాలు జరిగాయని వివరించారు. అత్యాచారాలకు పాల్పడిన నిందితులు యథేచ్ఛగా తిరుగుతున్నారని పేర్కొన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో నిత్యావసర ధరలు భారీగా పెరిగాయని, పెట్రోల్, కరెంట్, ఆర్‌టిసి ఛార్జీలు పెంచేశారని విమర్శించారు. కరెంట్ బిల్లు ఇంటి అద్దె అంత అయ్యిందన్నారు. జగన్ ఒక చేత్తో రూ.10 ఇచ్చి, మరో చేత్తో రూ.100 లాక్కుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా ఇసుక దొరకడం లేదని, అక్రమంగా పక్క రాష్ట్రాలకు తరలించి వైసిపి నేతలు కోట్లు దండుకుంటున్నారని విమర్శించారు. మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే ఇళ్లు, పొలాలు కొట్టేస్తారని, ఎవరికీ రక్షణ ఉండదని అన్నారు. వాలంటీర్లు రాజకీయం చేయొద్దన్నారు. వాలంటీర్లు ఇళ్లలోకి చొరబడి ప్రజల వ్యక్తిగత వివరాలు తెలుసుకుంటున్నారని ఆరోపించారు.



చైతన్య రథయాత్ర వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న చంద్రబాబు

ఆడపిల్లల వ్యక్తిత్వంపై నీచంగా మాట్లాడే, పోస్టులు పెట్టే వైసిపి నేతలకు దీటుగా సమాధానం చెప్పాలని తెలిపారు. తప్పు చేసిన ప్రతి వైసిపి నేతనూ బోనెక్కిస్తానని అన్నారు. సదస్సు అనంతరం చైతన్య రథయాత్ర వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు, మహిళా విభాగం అధ్యక్షురాలు వంగలపూడి అనిత, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ మంత్రి అఖిలప్రియ, మాజీ స్పీకర్ ప్రతిభా భారతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై త్వరలో విధాన నిర్ణయం : మంత్రి బొత్స

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్రంలో ఉపాధ్యాయ ఖాళీల వివరాలు తెలుసుకుని వాటి భర్తీపై ప్రభుత్వం ఒక విధాన నిర్ణయం తీసుకుంటుందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. శ్రీకాకుళంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు 160 రోజుల్లోనే కాదు 664 రోజులైనా ముఖ్యమంత్రి కాలేరని అన్నారు. ప్రభుత్వం నిధులు మళ్లిస్తోందంటూ టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ ఎవరు డబ్బులు, ఎవరు మళ్లిస్తున్నారని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు దోపిడీ చేసి దోచుకుతిన్నారని, ఇప్పుడు అబద్ధాలు చెప్తున్నారని విమర్శించారు. ప్రజల కోసం, వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు ఒక పథకం నుంచి మరో పథకానికి మళ్లిస్తామని తెలిపారు. తెలంగాణ విద్యావ్యవస్థపై ఇటీవల ఆయన చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో తెలంగాణ మంత్రుల స్పందనపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ ఆ విషయంపై రెండు రోజుల తర్వాత మాట్లాడతానని బదులిచ్చారు.

'ఉక్కు' దీక్షలకు కాంగ్రెస్ సంఘీభావం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం సాగుతున్న దీక్షలకు కాంగ్రెస్ నేతలు సంఘీభావం ప్రకటించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 883వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారికి మద్దతు తెలుపుతూ ఎఐసిసి సభ్యులు వేగి వెంకటేష్ మాట్లాడారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు చేయడం దారుణమన్నారు. ఉక్కు పరిరక్షణ కోసం త్వరలో తమ పార్టీ ఎపి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పాదయాత్ర చేయనున్నారని తెలిపారు. ఉక్కు పరిరక్షణ విషయమై ఆగస్టులో రాహుల్ గాంధీ విశాఖ రానున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కెఎస్‌ఎన్.రావు, నాయకులు ఎన్.రామారావు, ముత్యాలు, కె.పరంధామయ్య, దాసరి శ్రీనివాసరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు గొంప గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఊబిలో వైసిపి ప్రభుత్వం

- తణుకు సభలో పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - భీమవరం

మద్యంలో రూ.30 వేల కోట్లు, మైనింగ్‌లో రూ.40 వేల కోట్లు, సిమెంట్‌లో రూ.20 వేల కోట్లతో పాటు అనేక రకాలుగా వైసిపి ప్రభుత్వం గత నాలుగేళ్లలో సుమారు రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడిందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోపించారు. జనం బాగుండాలంటే వైసిపి పోవాలని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. రాజకీయాల్లో అవినీతిని పారదోలేందుకు జనసేన కృషి చేస్తోందన్నారు. ఈ నెల 9న ఏలూరు జిల్లాలో ప్రారంభమైన వారాహి రెండో దశ యాత్ర శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ముగిసింది. ఈ సందర్భంగా తణుకు పట్టణంలోని పైడిపర్రు సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ ప్రసంగించారు. ఇంటి పన్ను రూ.600 పెంచారని, చెత్త పన్ను రూ.వంద వేశారని, నిత్యావసరాల ధరలు గతంతో పోలిస్తే ఆకాశాన్నంటాయని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో లక్షా 60 వేల బెల్టుషాపులుంటే ప్రస్తుతం మూడు లక్షల బెల్టు షాపులు నడుస్తున్నాయని ఆరోపించారు. దిశ యాప్ ఉన్నా వైసిపి పాలనలో 3,372 ఆడబిడ్డలు అత్యాచారానికి గురయ్యారన్నారు. మహిళా కమిషన్, మహిళా మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పురోహితులను వేలం పాట వేసే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. హిందూ ధర్మానికేనా?ఇతర మతాలకు అలాగే చేస్తారా? అని ప్రశ్నించారు. మత సంబంధ విషయాల్లో ప్రభుత్వం దూరంగా ఉండాలని రాజ్యాంగం చెబుతోందని, అర్చకుల వేలంపై కోర్టులో సవాలు చేస్తానని తెలిపారు. వ్యక్తిగత సమాచారం సేకరించే వలంటీర్లు కూడా శిక్షార్హులని, దీనిపై ప్రతి వలంటీర్ తల్లిదండ్రులు ఆలోచించుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్ నిధులను పక్కదారి పట్టించి పంచాయతీ సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా కూర్చోబెట్టారన్నారు. తడిచిన ధాన్యం మొలకొచ్చాయని, ధాన్యం కొనండయ్యా అని వాపోయిన రైతును ఎర్రి.. అని సంబోధించిన మంత్రి అవినీతికి మూలస్తంభమని విమర్శించారు. తొలుత తణుకులోని హోటల్ చిట్టూరి హెరిటేజ్ నుంచి పైడిపర్రు సెంటర్ వరకూ మూడు కిలోమీటర్ల మేర రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జనసేన నియోజకవర్గ కన్వీనర్ విడివాడ రామచంద్రరావు, నేతలు పాల్గొన్నారు.

'అసైన్డ్ హక్కుల'తో 15.21 లక్షల మందికి లబ్ధి : మంత్రి ధర్మాన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసైన్డ్ భూములు పొంది 20 ఏళ్లుదాటిన వారికి ఆ భూమిపై యాజమాన్య హక్కులు కల్పించడంవల్ల రాష్ట్ర వ్యాప్తంగా 15.21లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలోని పబ్లిసిటి సెల్‌లో శుక్రవారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్ర జిడిపిలో 2శాతం కాంట్రిబ్యూషన్ పెరిగే అవకాశం ఉందని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత రాష్ట్రంలో ఇప్పటి వరకు 33.29లక్షల ఎకరాల భూమిని 19.21లక్షల మందికి అసైన్డ్ భూములు పంపిణీ చేయగా వాటిలో 27.41లక్షల ఎకరాలకు సంబంధించి నేడు 15.21లక్షల మందికి లబ్ధి కలుగుతుందన్నారు. అసైన్డ్ భూములను గతంలో ఎవరైనా భూస్వాములు, బలవంతంగా స్వాధీన పరుచుకుని వుంటే రెవిన్యూశాఖకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

ఫిర్యాదులను పరిశీలించిన తర్వాత చర్యలు తీసుకోవడంతో పాటు భూయజమానికి ఆయా భూములను తిరిగి అప్పగించడం జరుగుతుందన్నారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున భూ సంస్కరణలు తీసుకురావడం జరిగిందన్నారు. భూముల రీసర్వే దేశంలో మన రాష్ట్రంలో మాత్రమే జరుగుతోందన్నారు, భూముల రీ సర్వే ప్రారంభమైనప్పటి నుంచి నేటి వరకు 19లక్షల మ్యుటేషన్లు జరిగాయన్నారు. ఈ మీడియా సమావేశంలో సిసిఎల్‌ఎ సంయుక్త కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రెవెన్యూశాఖ సహాయ కార్యదర్శి గోపాలరావు పాల్గొన్నారు.

సెప్టెంబర్, అక్టోబర్‌ల్లో రాజకీయ ప్రచారోద్యమం

మొదటి పేజీ తరువాయి

అప్పగించి ప్రశాంతంగా ఉన్న ఇక్కడ మతవిద్వేషాన్ని రగిల్చేందుకు దోహదం చేస్తున్నాయని దుయ్యబట్టారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపికి ఎదురు తిరిగి నిలబడతారా? లేదా? అనేది టిడిపి, వైసిపి, జనసేన పార్టీ తేల్చుకోవాల్సిన అవసరముందన్నారు. బిజెపి అనుసరిస్తోన్న మతతత్వ విధానాలపైనా, అందుకు వంతపాడే విధంగా ఉంటున్న ప్రాంతీయ పార్టీల వైఖరిపైనా సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో రాజకీయ ప్రచారోద్యమంలో ఎండగడతామని చెప్పారు. ఈ ప్రచారోద్యమాన్ని స్వతంత్రంగానూ, వామపక్షాలతోనూ చర్చించి చేపడతామని తెలిపారు. అక్రమంగా అన్యాక్రాంతమైన అసైన్డు భూములపైనా తమ పోరాటం ఉంటుందని చెప్పారు. రాష్ట్ర మంత్రివర్గం అసైన్డు భూముల విషయంలో చేసిన నిర్ణయం పేదల కంటే పెద్దలకు, అక్రమార్కులకు ఎక్కువ ప్రయోజనం చేకూరే విధంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదారు లక్షల ఎకరాలు భూస్వాములు, రియల్టర్లు, కబ్జాదారుల వద్ద ఉన్నాయని తెలిపారు. వాటన్నింటినీ స్వాధీనం చేసుకుని నిజమైన లబ్ధిదారులకు అందివ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ వాహనాల ద్వారా సబ్సిడీ ధరపై నిత్యావసర సరుకులను అందివ్వాలని డిమాండ్ చేశారు. వలంటీర్ల వ్యవస్థను ప్రజా సంక్షేమాన్ని ప్రజలకు చేర్చేదిగా కాకుండా రాజకీయంగా ఉపయోగించుకోవాలని చూడడం సరైంది కాదన్నారు. సచివాలయాలను పంచాయతీల పరిధిలోకి తీసుకొచ్చి వాటికి అధికారాలు, విధులివ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్‌వాడీలు చేపట్టిన ఉద్యమానికి మద్దతు తెలుపుతూ రాష్ట్ర కమిటీలో నిర్ణయం చేసినట్టు తెలిపారు. ఆ సంఘం నాయకులతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరి రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపకుండా, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు సాధించకుండా ఒరగబెట్టేది ఏమి ఉంటుందని ప్రశ్నించారు. విభజన హామీలు అమలు చేయాలని కేంద్రాన్ని ఆ పార్టీ నేతలు అడిగి నిధులు రాష్ట్రానికి రప్పించే ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు ఒపిఎస్ (పాత పెన్షన్) విధానం కావాలని కోరుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం జిపిఎస్ పేరుతో కొత్తది తీసుకొస్తామంటోందన్నారు. జిపిఎస్ త్రిశంకు స్వర్గం వంటిదని పేర్కొన్నారు. ఉద్యోగుల డిమాండ్ చేస్తోన్న ఒపిఎస్‌కే సిపిఎం మద్దతు తెలుపుతోందన్నారు. దీనికోసం వారు చేపట్టే ఉద్యమానికి మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పాల్గొన్నారు.

ఎపి ఎడ్ సెట్, పిజి సెట్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రాష్ట్ర వ్యాప్తంగా బిఇడి కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఎపి ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలను ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి శుక్రవారం విడుదల చేశారు. పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 11,236 మంది హాజరుకాగా 10,908 మంది ఉత్తీర్ణత సాధించారు. 97.08 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మ్యాథమెటిక్స్‌లో 99.63, ఫిజికల్ సైన్స్‌లో 98.66, బయలాజికల్ సైన్స్‌లో 95.41, సోషల్ స్టడీస్‌లో 95.59, ఇంగ్లీషులో 99.58 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. మ్యాథమెటిక్స్‌లో వై.సాగర్, ఫిజికల్ సైన్స్‌లో ఎం.తిరుపతి నాయుడు, బయాలజీలో ఎల్.ఆస్మా, సోషల్ స్టడీస్‌లో ఎస్.బలరాం నాయుడు, ఇంగ్లీషులో బి.నవీన్ మొదటి ర్యాంకులు సాధించారు. కార్యక్రమంలో ఎపి ఎడ్‌సెట్ - 2023 కన్వీనర్ ఆచార్య కె.రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిజి సెట్‌లో 85.29 శాతం మంది ఉత్తీర్ణత

రాష్ట్ర వ్యాప్తంగా పిజి కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఎపి పిజి సెట్ - 2023 ప్రవేశ పరీక్ష ఫలితాలనూ ఎయు విసి ప్రసాదరెడ్డి విడుదల చేశారు. పరీక్షకు 26,799 మంది విద్యార్థులు హాజరుకాగా 22,858 మంది అర్హత సాధించారు. ఆంధ్రప్రదేశ్‌లో 36, తెలంగాణాలో ఒక కేంద్రంలో జరిగిన ఈ పరీక్షల్లో 85.29 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 85.24, బాలికలు 85.33 శాతం మంది ఉన్నారు. మొత్తం 21 సబ్జెక్టుల్లో పరీక్షలు నిర్వహించారు. ఇంగ్లీషులో డి.సుధాకర్‌రావు, తెలుగులో కె.నవ్య, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లో వై.రిషిత, హిస్టరీలో జి.భార్గవి, పొలిటికల్ సైన్స్‌లో ఎం.రాహుల్, ఎకనామిక్స్‌లో బి.ప్రసాద్, కామర్స్‌లో జె.సూర్య సాయి చరణ్, ఎడ్యుకేషన్‌లో బి.రామకృష్ణ, లైఫ్ సైన్స్‌లో పి.రేణుక, ఫుడ్ అండ్ న్యూట్రిషనల్ సైన్స్‌లో కె.వైష్ణవి, బోటనీలో వి.వరుణ్, సెరీకల్చర్‌లో జి.వెన్నెల, జువాలజీలో పిఆర్.గాయత్రి, మ్యాథమేటిక్స్‌లో వై.సాగర్, స్టాటస్టిక్స్‌లో టి.ప్రద్యున్, ఫిజికల్ సైన్స్‌లో షేక్ రోషన్, ఎలక్ట్రానిక్స్‌లో ఎస్.బాలమణి, కెమికల్ సైన్స్‌లో టి.రాజశేఖర్, జియాలజీలో డి.జ్యోష్నవి, సైకాలజీలో పి.లక్ష్మి సౌజన్య, కంప్యూటర్ సైన్స్‌లో టి.సురేష్ కుమార్ మొదటి ర్యాంకులు సాధించారు. కార్యక్రమంలో ఎపి పిజి సెట్ - 2023 కన్వీనర్ ఆచార్య సిహెచ్‌వివిఎస్.భాస్కర రెడ్డి పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న ఎయు విసి ప్రసాద్ రెడ్డి



అభివాదం చేస్తున్న వైవిబి రాజేంద్రప్రసాద్, వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు తదితరులు

గ్రామ పంచాయతీ అకౌంట్లలో నిధులు జమ చేయకపోతే సిఎం నివాసం ముట్టడి

- ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతోపాటు నిధులు, విధులు, అధికారాల సాధనలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని ఎపి గ్రామ పంచాయతీరాజ్ ఛాంబర్ నిర్ణయం తీసుకుంది. విజయవాడ బందరు రోడ్డులోని బాలోత్సవ భవన్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు అధ్యక్షతన పంచాయతీరాజ్ ఛాంబర్ సమావేశం జరిగింది. నిరసనల కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశం పలు తీర్మానాలు చేసింది. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి నివాసం ముట్టడించాలని, అదేవిధంగా అసెంబ్లీ సమావేశాలు జరిగే సమయంలో శాసనసభను ముట్టడించాలని సమావేశం తీర్మానించింది. రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీల్లో దొంగలు పడి రూ.8,660 కోట్లను దొంగలించారని, అన్ని జిల్లా కేంద్రాల్లో విచారణ జరిపి శిక్షించాలంటూ సర్పంచ్‌లందరూ ఈనెల 17న ఫిర్యాదు చేయాలని తీర్మానించారు. ఇందుకోసం దశలవారీ ఆందోళన చేపట్టాలని నిర్ణయించి కార్యాచరణకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల రమేష్ పాల్గొన్నారు.



నూతన విసికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న రిజిస్ట్రార్ రామిరెడ్డి

కృష్ణా యూనివర్సిటీ నూతన ఉపకులపతిగా జ్ఞానమణి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్

కృష్ణా యూనివర్సిటీ ఉపకులపతిగా ఆంధ్ర యూనివర్సిటీ పూర్వ జువాలజీ ప్రొఫెసర్ జి.జ్ఞానమణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపకులపతి పదవి బాధ్యతలతో కూడుకున్నదని, దానిని సమర్ధవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీలో వివిధ విభాగాలలో తనకు పరిపాలన అనుభవం ఉందని, బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ, శ్రీకాకుళం మొదటి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహించినట్లు చెప్పారు. అందరి సహకారంతో యూనివర్సిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. విసిగా బాధ్యతలు చేపట్టిన జ్ఞానమణికి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పవన్‌కల్యాణ్ రాజకీయాలకు పనికి రాడు : మంత్రి అంబటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాజకీయాలకు పనికిరాడని ఆయన వ్యవహార శైలే చెబుతోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో రాంబాబు మీడియాతో మాట్లాడారు. కాపులను మచ్చిక చేసుకుని చంద్రబాబుకు అమ్మేందుకే వారాహి యాత్ర అని అన్నారు. గతంలో యువరాజ్యానికి అధ్యక్షుడిగా వుండి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పంచె ఊడగొడతా అని అనుచిత వ్యాఖ్యలు చేసి ప్రజారాజ్యానికి నష్టం చేశారని తెలిపారు. పవన్ ప్రసంగాలను చూసి ఆయన వెంట ఉన్నవారు కూడా దూరమవుతున్నారని అన్నారు. 2019లో జనసేన ఎమ్మెల్యేగా గెలిచిన రాపాక వరప్రసాద్, సిబిఐ మాజి జెడి లక్ష్మీనారాయణ, తమిళనాడుకు చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారి రామ్మోహన్‌రావు, తోట చంద్రశేఖర్‌రావు, పివి రావు, సిహెచ్ పార్ధసారథి ఇలా అందరూ వెళ్లిపోతున్నా... పవన్‌కల్యాణ్‌కు బుద్ధిరావడం లేదని అన్నారు. పవన్ కల్యాణ్ తన శైలిని మార్చుకోకపోతే ఎమ్మెల్యే కూడా కాలేడని చెప్పారు.

హాస్టల్ సమస్యలపై విద్యార్థుల ఆందోళన

- ఎస్ఎఫ్ఐ నాయకులపై పోలీసు జులుం
- నలుగురు అరెస్టు, విడుదల

ప్రజాశక్తి-శృంగవరపుకోట (విజయనగరం)

గిరిజన కళాశాల వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళనకు దిగిన విద్యార్థులపై, నాయకులపై పోలీసులు జులుం ప్రదర్శించారు. వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కో కన్వీనర్ లావణ్య స్పృహకోల్పోయారు. విజయనగరం జిల్లా ఎస్ కోట పట్టణంలోని గిరిజన బాలికల కళాశాల వసతి గృహానికి ప్రహరీ నిర్మించి గేట్లను ఏర్పాటు చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కళాశాల హాస్టల్ నుంచి విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం దేవి బొమ్మ కూడలికి చేరుకొని రాస్తారోకో చేశారు. తమ న్యాయమైన సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చేంతవరకు విరమించేది లేదని విశాఖ- అరకు రహదారిపై వారు బైఠాయించారు. ఎస్ఐ తారకేశ్వరరావు అక్కడికి చేరుకొని ఆందోళన విరమించాలని, లేదంటే అరెస్టు చేస్తామని హుకుం జారీ చేశారు. ఆ తరువాత. విద్యార్థినులను పోలీసులు పక్కకు తోసి ఎస్ఎఫ్ఐ నాయకులు వి చిన్నబాబు, ఎం హర్ష, కె రమేష్, రామును అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. గర్ల్స్ కో-కన్వీనర్ లావణ్యను ఈడ్చుకుపోతుండగా ఆమె స్పృహ కోల్పోయారు. అరెస్టు చేసినవారిని విడిచిపెట్టాలని కోరిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రామ్మోహన్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ ప్రహరీ, గేటు లేక విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారని, రాత్రిపూట ఎవరు ప్రవేశిస్తారోనని ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి నెలాఖరులోగా సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతి అందజేశారు.



ఎస్ఎఫ్ఐ నాయకులను, విద్యార్థినులను అరెస్టు చేస్తున్న పోలీసులు

'ఉపాధి' కార్మికురాలు మృతి

ప్రజాశక్తి - పంగులూరు (బాపట్ల జిల్లా) : ఉపాధి పని చేస్తూ గుండెపోటుతో మహిళా కార్మికురాలు మృతి చెందిన సంఘటన బాపట్ల జిల్లా పంగులూరు మండలంలోని జనకవరంలో జరి గింది. గ్రామానికి చెందిన గుడిపాటి ప్రమీల (47) పంట కాలువ పూడికతీత పనికి ఉపాధి కార్మికులతో కలిసి వెళ్లారు. పనిచేస్తుండగా గుండెపోటు రావడంతో ఆమెను అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు.

రూ. 900 కోట్ల నిధుల దుర్వినియోగంపై విచారణ

- రామకృష్ణ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాయలసీమ కరువు నివారణ ప్రాజెక్టుల పేరుతో తీసుకున్న రూ.900 కోట్ల రుణాన్ని అక్రమంగా ప్రైవేట్ కంపెనీకి మళ్లించడంపై సమగ్ర విచారణ జరపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని అయినా, రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే అప్పులైనా మొదట కన్సాలిడేటెడ్ ఫండ్‌లోకి వచ్చిన తర్వాత ఖర్చు చేయాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాయలసీమ కరువు నివారణ ప్రాజెక్టుకింద రూ.3,825 కోట్లతో రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టును చేపట్టామని అప్పు కోసం వెళ్లిందని తెలిపారు. 70 శాతం అప్పుగా తెచ్చుకున్న రూ.900 కోట్లను సిఎం అత్యంత సన్నిహితుడికి చెందిన కంపెనీకి పనులు జరగక పోయినా మళ్లించేశారని తెలిపారు. కనీసం పనులు జరిగాయో లేదో అని నిర్ధారించుకోకుండా రాష్ట్రప్రభుత్వం నిధులు మళ్లించడం అంటే ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని పేర్కొన్నారు. ప్రజాధనం దుర్వినియోగంపై, రాష్ట్ర ఖజానా లెక్కలకు జవాబుదారీతనం లేకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కరువు పేరుతో తెచ్చుకున్న నిధులను కూడా కాజేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ఈ రూ.900 కోట్ల దోపిడీపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

సుప్రీంలో వైఎస్ భారతికి ఊరట

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భార్య వైఎస్ భారతికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. మనీలాండరింగ్ కేసులో కేంద్ర ఏజెన్సీ అటాచ్ చేసిన ఆస్తులను ఫిక్స్‌డ్ డిపాజిట్లతో భర్తీ చేసేందుకు వైఎస్ భారతిని అనుమతిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు కొట్టివేసింది. న్యాయమూర్తులు జస్టిస్ ఎఎస్ ఓకా, జస్టిస్ సంజయ్ కరోల్‌లతో కూడిన ధర్మాసనం ఇడి పిటిషన్‌ను విచారించింది. ఇడి అటాచ్ చేసిన స్థిరాస్తి నేరం వల్ల వచ్చిన ఆదాయమేనా? అని ప్రశ్నించింది. ఇడి తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్. రాజు వాదనలు వినిపించగా కాదని, అయితే "సమానమైన విలువ" అని చెప్పారు. వైఎస్ భారతి తరపున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి, న్యాయవాది లిజ్ మాథ్యూ వాదనలు వినిపించారు. అటాచ్ చేసిన ఆస్తి ఆరోపించిన నేరానికి సంబంధించిన వాస్తవ ఆదాయాలు కాదని నిర్ధారించిన హైకోర్టు ఉత్తర్వుల్లో అనేక అంశాలను వారు ప్రస్తావించారు. భారతి సిమెంట్‌కు సంబంధించి మనీలాండరింగ్ ఆరోపణల కింద ఈ ఆస్తిని ఇడి అటాచ్ చేసింది.

హైకోర్టు ఆదేశంలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. "అటాచ్ చేసిన ఆస్తి అసలు నేరంతో సంపాదించిన ఆస్తి కాదు. ఇడి గుర్తించిన అంశాలు వివాదాల్లోనివి కాదు. పైగా, తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులలో పేర్కొన్న అటాచ్ చేసిన ఆస్తి విలువ తప్పుగా పేర్కొంది. ఈ వాస్తవ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ఇడి పిటిషన్‌ను స్వీకరించడానికి నిరాకరిస్తున్నాం" అని ధర్మాసనం పేర్కొంది.

గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలు విడుదల

- 2న ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఎపిపిఎస్‌సి) గ్రూప్-1 మెయిన్ పరీక్షల ఫలితాలను విడుదల చేసింది. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలను కమిషన్ తన వెబ్‌సైట్ www.psc.ap.gov.in లో పొందుపరిచింది. ఈ మేరకు ఎపిపిఎస్‌సి కార్యదర్శి జె ప్రదీప్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2022 సెప్టెంబర్ 30న ఎపిపిఎస్‌సి గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. జనవరిలో నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షకు 1,26,229 మంది దరఖాస్తు చేసుకోగా, 6,455మంది అర్హత సాధించారు. వీరిలో 5028 మంది అభ్యర్థులు జూన్ 3 నుంచి 10 వరకు నిర్వహించిన మెయిన్ పరీక్షలకు హాజరయ్యారు. ఒక్కో పోస్టుకు ఇద్దరు చొప్పున మొత్తం 220 మంది అభ్యర్థులను ఎపిపిఎస్‌సి ఎంపిక చేసింది. స్పోర్ట్స్ కోటాలో 39 మందిని ఎంపిక చేసింది. వీరికి ఈ నెల 27వ తేదిన సర్టిఫికేట్ల వెరిఫికేషన్‌ను ఎపిపిఎస్‌సి నిర్వహించి ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ ఆథారిటీ(శాప్)కు జాబితాను పంపుతుంది. శాప్ పంపిన స్కోర్స్‌ను బట్టి ఎపిపిఎస్‌సి వీరిలో మరో ఇద్దరిని ఎంపిక చేస్తుంది. ప్రధాన పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఆగస్టు 2వ తేదిన ఎపిపిఎస్‌సి కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరగనున్నాయి. అభ్యర్థులు వయస్సు, అర్హత, స్టడీ సర్టిఫికేట్, రెసిడెన్సి సర్టిఫికేట్, స్థానిక, కుల ధృవీకరణ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికేట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కార్యదర్శి వెల్లడించారు.

ఎఐబిపి పథకాలపై 28న ట్రైపార్టీ భేటీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

దేశ వ్యాప్తంగా అమలులో ఉన్న పథకాలపై కేంద్ర ఆర్థికశాఖ ట్రైపార్టీ పోర్ట్‌ఫోలియో సమావేశాన్ని ఈ నెల 28న నిర్వహించనుంది. ప్రధానంగా ఎఐబిపి (ఆక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్ ప్రోగ్రామ్స్) నిధుల ద్వారా జరుగుతున్న పనులపై సమీక్షించనున్నారు. 30 పథకాలపై ఈ సమీక్ష నిర్వహిస్తుండగా, అందులో మూడు పథకాలు రాష్ట్రానికి సంబంధించి ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారులు, పట్టణ నీటి సరఫరా, పారిశుధ్యం అమలు ప్రాజెక్టు, 27/7 అందరికీ విద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటికి సంబంధించి పూర్తి స్థాయి నివేదికలు సిద్ధం చేయాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. దీనికోసం ప్రత్యేక ప్రొఫార్మాను కూడా రాష్ట్రానికి పంపించింది. ఈ ప్రాజెక్టు కోసం తీసుకున్న రుణం, ప్రాజెక్టును అమలు చేస్తున్న ప్రభుత్వ సంస్థ, ఆ ప్రాజెక్టుల పురోగతి వంటి అంశాలను నివేదించాలని పేర్కొంది.

వంద కోట్ల పరువు నష్టం దావా

- నాపై తప్పుడు ప్రచారం చేసిన వారిని వదిలిపెట్టను
- టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్

ప్రజాశక్తి-మంగళగిరి (గుంటూరు జిల్లా)

నాపై తప్పుడు ప్రచారం చేసిన ఎవరినీ వదిలిపెట్టనని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి అడిషనల్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో తనపైనా, తన కుటుంబంపైనా వైసిపి నేతలు చేసిన అసత్య ఆరోపణలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కేసు దాఖలు చేశారు. అనంతరం మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అసత్య ఆరోపణలకు చెక్ పెట్టాలని పరువు నష్టం దావాలు వేస్తున్నానని చెప్పారు. తనపై చేసిన అసత్య ఆరోపణలు వెనక్కి తీసుకోవాలని పోతుల సునీతను హెచ్చరించినా వినిపించుకోలేదని, అందువల్ల రూ.50 కోట్లు పరువు నష్టం దావా వేశానని తెలిపారు. తన పిన్ని ఆస్తిని కాజేసినట్లుగా జి.దేవేంద్ర రెడ్డి తనపై తప్పుడు పోస్టు పెట్టినందుకు రూ.50 కోట్లు పరువు నష్టం దావా వేశానని చెప్పారు. 2012 సంవత్సరం నుండి తన ఎదుగుదలను లక్ష్యంగా చేసుకొని అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టిఆర్‌పైనా, చంద్రబాబుపైనా కాంగ్రెస్ పార్టీ ఆరోపణ చేసిందన్నారు. ఒక్క ఆరోపణ కూడా నిరూపించలేకపోయారని తెలిపారు. తాను ఇంగ్లీష్ మీడియంలో చదువుకున్నానని, తెలుగులో మాట్లాడేటప్పుడు కొన్ని తప్పులు దొర్లితే వాటిని వేరే విధంగా వైసిపి నేతలు సోషల్ మీడియాలో పెట్టి అవమానించారని అన్నారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్ పాత్రపై సిబిఐ విచారణ జరగాలని లోకేష్ డిమాండ్ చేశారు. పాదయాత్రలో వైసిపి ఎమ్మెల్యేలు, మంత్రులపై చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. అధికారంలోకి రాగానే సిట్ ఏర్పాటు చేసి అందరి సంగతి తేలుస్తామని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్, స్థానిక నాయకులు నందం అబద్దయ్య, పోతినేని శ్రీనివాసరావు, కాండ్రు శ్రీనివాసరావు, టి జానకి దేవి తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరి కోర్టులో నారాలోకేష్

మహిళల రక్షణకు పోరుయాత్ర

- 28 నుంచి రాష్ట్ర మహిళా జాతాలు : ఐద్వా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో మహిళలు, పిల్లలపై జరుగుతున్న హింసను వ్యతిరేకిస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి రాష్ట్ర వ్యాప్త పోరుయాత్రను చేపడుతున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి తెలిపారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని రేడియెంట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో మహిళలపై హింస రోజురోజుకు పెరిగిపోతోందన్నారు. ఈ హింసను నిర్మూలించాలని ఐద్వా ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ నుంచి ఆగస్ట్ 8వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా రెండు మహిళా జాతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం నుంచి ఒక జాతా, విశాఖపట్నం నుంచి మరొక జాతా ప్రారంభిస్తామన్నారు. ఆగస్టు 8న విజయవాడలో మహిళలతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. ఈ సభకు ఐద్వా జాతీయ కార్యదర్శి బృందాకరత్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. మహిళలపై హింస కేసులను 41 రోజుల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ జరిపించి నిందితులకు కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లపై బిజెపి ఎంపి లైంగిక వేధింపులకు పాల్పడితే అతనిపై చర్యలు తీసుకోకుండా కేంద్రం ప్రేక్షక పాత్ర వహిస్తోందన్నారు. దేశం, రాష్ట్రంలో నేరాల నియంత్రణకు న్యాయనిపుణులు, రిటైర్డ్ న్యాయమూర్తులు, ఇతర అధికారులతో కలిపి స్వతంత్ర కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని జాతాల సందర్భంగా డిమాండ్ చేయనున్నట్లు చెప్పారు. ఈ విలేకర్ల సమావేశంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి ప్రభావతి, రాష్ట్ర కోశాధికారి వి సావిత్రి, రాష్ట్ర సహాయ కార్యదర్శి బి శ్రీదేవి, జిల్లా అధ్యక్షులు శ్యామల పాల్గొన్నారు.

28 నుంచి 30 వరకూ
విజయవాడలో సీఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మత్స్య సంపద వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా ఈనెల 28నుంచి 30వరకు విజయవాడలో సీఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ కె. కన్నబాబు తెలిపారు.సచివాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విజయవాడలోని ఎ వన్ కన్వెన్షన్ సెంటర్‌లో భూమి ఆర్గానిక్స్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. మత్స్యసంపద వినియోగాన్ని పెంచడం, ప్రత్యామ్నాయ మార్కెటింగ్ సౌకర్యాలను విస్తృతం చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమని అన్నారు. సాలీనా 50లక్షల మెట్రిక్ టన్నులతో మత్స్య సంపద ఉత్పత్తిలో రాష్ట్రం ఆక్వా హబ్‌గా పేరు తెచ్చుకుందన్నారు. దేశ వ్యాప్తంగా 75శాతం మేర రొయ్యలు మన రాష్ట్రంలో ఉత్పత్తి అవుతుంటే వాటి వినియోగం రాష్ట్రంలో 5శాతంలోపే ఉందన్నారు. డొమెస్టిక్ మార్కెట్‌ను విస్తృత పరచాల్సిన అవసరం ఉందన్న సిఎం ఆదేశాల ప్రకారం తక్షణ చర్యగా "ఫిష్ ఆంధ్రా" అనే ఒక బ్రాండును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ తరువాత విశాఖ, కాకినాడ, భీమవరం, నెల్లూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో సీఫుడ్ ఫెస్టివల్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్లు వివిరావు, హీరానాయక్ పాల్గొన్నారు.

రైతు దోపిడీ మార్కెట్

- ఎపి రైతుసంఘం నాయకుల విమర్శ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం మార్కెట్‌యార్డు రైతును దోపిడీ చేసే మార్కెట్‌లాగా ఉందని ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. అనంతపురం నగరంలోని మార్కెట్ యార్డును శుక్రవారం వారు పరిశీలించారు. అక్కడికొచ్చిన చీనీ రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ దళారీ వ్యవస్థ లేకుండా రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తామంటూ ప్రభుత్వం ఇ-నామ్ పద్ధతిని అమలు చేస్తోందని తెలిపారు. దీని ప్రకారం కాయ క్వాలిటీని కంప్యూటర్ ద్వారా నిర్ధారించి ధరను అధికారులు ప్రతిపాదిస్తారన్నారు. కానీ అనంతపురం మార్కెట్‌కు రైతులు తెచ్చిన చీనిపంటకు ధరను ఆ రకంగా అధికారులు కాకుండా వ్యాపారులే ధర నిర్ణయిస్తున్నారని తెలిపారు. దీని వల్ల రైతుకు అందాల్సిన ధర అందడంలేదని తెలిపారు. ఇది ఇ-నామ్ మార్కెట్ కాదని రైతులను దోపిడీ చేసే మార్కెట్‌లాగా ఉందని విమర్శించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మార్కెట్‌లో ప్రస్తుతం చీనీ టన్ను ధర కనిష్టంగా నాలుగు వేలు గరిష్టంగా రూ.12 వేల వరకు ఉందని తెలిపారు. రైతులకు ఏమాత్రమూ గిట్టుబాటు ధర లభించడం లేదని చెప్పారు. కనీసం టన్ను రూ.30 వేల వరకైనా ధర ఉంటేనే రైతుకు గిట్టుబాటు అవుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ కమీషన్ కూడా చాలా ఎక్కువగా ఉందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన కమీషన్ నాలుగు శాతమయితే, ఇక్కడ పది శాతం ఉందని తెలిపారు. ఇంత దోపిడీ ఎక్కడా ఉండదని, ఈ దోపిడీపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి పండ్ల తోటల రైతు సంఘం అధ్యక్షులు శివారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




అనంతపురం మార్కెట్‌యార్డులో చీనీ కాయలు పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం నాయకులు

ఎస్‌బిఐ యోనో యుపిఐ యాప్ వచ్చేసింది..

- ఏ బ్యాంక్ ఖాతాదారు అయినా వాడొచ్చు
- డెబిట్ కార్డ్ లేకుండా నగదు ఉపసంహరణ

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) కొత్తగా యోనో యుపిఐ యాప్‌ను తెచ్చింది. ఎస్‌బిఐలో ఖాతా లేని వారు కూడా.. ఏ బ్యాంక్ ఖాతాదారు అయినా ఈ మొబైల్ యాప్‌ను ఉపయోగించి లావాదేవీలు చేయడానికి వీలు కల్పించింది. దీని కోసం వినియోగదారులు ఎస్‌బిఐ యోనో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని.. అనంతరం 'న్యూ టు ఎస్‌బిఐ'ను క్లిక్ చేసి 'రిజిస్టర్ నౌ'పై నమోదు చేసుకుంటే సరిపోతుందని ఆ బ్యాంక్ తెలిపింది. తమ డిజిటల్ బ్యాంకింగ్ యాప్ సేవలను ప్రతీ ఒక్కరికీ అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో 'యోనో ఫర్ ఎవ్రీ ఇండియన్' ట్యాగ్‌లైన్‌తో దీన్ని ఆవిష్కరించామని వెల్లడించింది. ఈ యాప్ ద్వారా స్కాన్ అండ్ పే, పే బై కాంటాక్ట్స్, రిక్వెస్ట్ మనీ తదితర లావాదేవీలు చేయడానికి సౌలభ్యం ఉందని పేర్కొంది. అదే విధంగా డెబిట్ కార్డ్ లేకుండానే నగదు ఉపసంహరణ చేసుకునే సౌలభ్యం ఈ యాప్‌లో ఉందని తెలిపింది. ఐసిసిడబ్ల్యు సౌకర్యం ఉన్న ఎటిఎంలో ఏ బ్యాంక్ ఖాతాదారు అయినా ఎస్‌బిఐ యోనో ద్వారా యుపిఐ క్యూఆర్ క్యాష్ ఆప్షన్ ద్వారా నగదు తీసుకోవచ్చని వెల్లడించింది. ఈ సదుపాయంతో ప్రస్తుతమున్న ఇతర యుపిఐ యాప్‌లకు ఎస్‌బిఐ తీవ్ర పోటీని ఇవ్వనుందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.



సంపాదకీయం


అందుకుందాం జాబిల్లి

చందమామ రావే..జాబిల్లి రావే అంటూ లాలి పాడని గడప తెలుగునాట ఉండదంటే అతిశయోక్తి కాదు. తరతరాలుగా గొంతెత్తి పాడుతున్నా..చందమామ దరికి చేరింది లేదు..అందుకే చందమామ దగ్గరికి మనమే పయనమవుతున్నాం. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సంకల్పించిన ఈ బహుదూరపు గమ్యానికి 2008లో చంద్రయాన్ 1తో 'మేమొస్తున్నాం..' అంటూ నెలరేడుకి హాయి చెప్పివచ్చాం. 2019లో మలి ప్రయత్నంలో జాబిల్లికి దగ్గరగా వెళ్లినట్టే వెళ్లి ఒక్క అడుగు దూరంలో నిలిచిపోయాం. ఇప్పుడు మళ్లీ బాటలో కుదుపులేవీ లేకుండా సజావుగా చందమామ చేరేందుకు సకల సాంకేతిక హంగులు పోదిపర్చుకుని చంద్రయాన్ 3 దిగ్విజయంగా దూసుకెళ్లింది. 2019లో చంద్రయాన్ 2 విఫలం కావడంతో నాటి ఇస్రో ఛైర్మన్ శివన్ కంటతడి పెట్టిన వైనం ఇంకా కళ్ల ముందు కదలాడుతూనేవుంది. శుక్రవారం చంద్రయాన్ 3 నింగిలోకి నిప్పులు చెరుగుతూ దూసుకెళ్తుంటే కోట్లాది కొత్త ఆశలు చిగురించాయి. శాస్త్రవేత్తల నిరంతర కృషి, అకుంఠిత దీక్షా పట్టుదల అభినందనీయం. ఓటమికి కుంగిపోకుండా సాధించాలన్న తపనతో అనతికాలంలోనే మరో బృహత్తర ప్రయోగానికి సంకల్పించడం ఆషామాషీ కాదు. ఇప్పుడు చందమామను దక్షిణ ధ్రువంపై రోవర్ 'ప్రజ్ఞాన్' ఎప్పుడెప్పుడు ముద్దాడుతుందా! అని భారతావని ఎదురుచూస్తోంది. శ్రీహరి కోట నుంచి నింగిలోకి ఎగిసిన చంద్రయాన్ 3 చంద్రుడి దగ్గరకు చేరడానికి సుమారు 40 రోజుల సమయం పడుతుంది. చంద్రయాన్ 2 ప్రయోగం 2019 జులై 22న ప్రారంభం కాగా 2019 సెప్టెంబరు 6న విక్రమ్ ల్యాండర్ నుంచి చంద్రునిపై దిగేందుకు సిద్ధమై ఆఖరి క్షణాన విఫలమైంది. ఈ ప్రక్రియ 48 రోజుల్లో పూర్తయింది. చంద్రయాన్ 1 ప్రయోగం 2008 ఆగస్టు 28 మొదలై అదే ఏడాది నవంబరు 12న చంద్రుడి కక్ష్యను చేరింది. ఇందుకు 77 రోజులు పట్టింది. 1969లో అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా చంద్రుడికి వ్యోమగాములను నాలుగు రోజుల్లో పంపగలిగింది. నేడు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నా..అది కూడా మానవ రహిత ప్రయోగానికి ఇస్రోకు ఎందుకు 40 రోజుల సమయం పడుతోంది? అంటే అంతరిక్ష పరిశోధనాల్లో మనం సాధించాల్సింది ఇంకా ఎంతో ఉందన్న వాస్తవాన్ని గ్రహించక తప్పదు. ఇస్రో ప్రతి ప్రయోగానికి ముందు తిరుమలలో పూజలు చేయించేటువంటి అశాస్త్రీయ పద్ధతులు కొనసాగించడం శోచనీయం.

చంద్రుడిపై ఆవాసానికి అనువైన పరిస్థితులు ఉన్నాయా? లేదా? అనేది అధ్యయనం చేసేందుకు చేపట్టిన చంద్రయాన్ 3 ఇస్రో చేపట్టిన అంతరిక్ష ప్రయోగాల్లో మహోన్నతమైనదే అనడంలో ఎటువంటి సందేహం లేదు. అయితే చంద్రుడిపై రోవర్ ల్యాండ్ అయ్యే ప్రక్రియ ఇస్రోకు ఒక గడ్డు సవాల్‌గా నిలిచింది. ఇప్పటి వరకు కేవలం మూడే మూడు దేశాలు అమెరికా, చైనా, రష్యా జాబిల్లిపైకి తమ ఆనవాళ్లు పంపగలిగాయి. చంద్రయాన్ 3 తర్వాత వెనువెంటనే చేపట్టాల్సిన అనేక బృహత్ ప్రాజెక్టులకు ఇస్రో సంసిద్ధమవుతుండటం స్ఫూర్తిదాయకం. అంతరిక్షయానంలోకి తొలి భారతీయ మానవ సహిత మిషన్ కోసం గగన్‌యాన్, ఆ తర్వాత సూర్యుడిపై అధ్యయనం కోసం, తదుపరి శుక్ర గ్రహంపై పరిశోధనలు ఇలా ఒకదాని వెంబడి ఒకటి వరుసగా ఉన్నాయి. వీటన్నిటికి చంద్రయాన్ 3 విజయం కొత్త ఉత్తేజాన్ని నింపుతుందనడంలో సందేహం లేదు. అంతరిక్ష పరిశోధనలకు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించి చేయూతనందిస్తే శాస్త్రవేత్తలు ఎన్నో అద్భుత విజయాలు సాధిస్తారు.

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత శాస్త్ర పరిశోధనల రంగంపై తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోంది. నిధుల కేటాయింపుల్లో కోతలు విధించడమే గాకుండా అత్యంత ప్రతిష్టాత్మకమైన పరిశోధన రంగాన్ని నిర్వీర్యం చేస్తోంది. దశాబ్దాల పరిశోధనలు ఫలించి విదేశీ ఉపగ్రహాలను కూడా నింగిలోకి ప్రవేశపెట్టే స్థాయికి ఎదిగిన దశలో భారత అంతరిక్ష పరిశోధన రంగాన్ని ముక్కలుగా విడగొట్టి ప్రయివేటు కంపెనీలకు కట్టబెట్టే కుట్రను మోడీ సర్కార్ వేగంగా కొనసాగిస్తోంది. ప్రయివేటు సంస్థలు చేపట్టే ఉపగ్రహ ప్రయోగాలకు వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) నుంచి మినహాయింపును ఇస్తూ ఇటీవల జరిగిన 50 కౌన్సిల్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికైనా ప్రయివేటు జపం చేయడం మాని ప్రభుత్వ పరిశోధన సంస్థలను ప్రోత్సహించడంపై పాలకులు దృష్టి సారించాలి. చంద్రయాన్ 3 లాంటి అద్భుత ప్రయోగాలకు సంకల్పించిన శాస్త్రవేత్తలకు అదే గొప్ప అభినందన. ఇటువంటి ప్రతిబంధకాలన్నిటినీ అధిగమించి గొప్ప ధృడసంకల్పంతో పరిశోధనల కదనరంగంలోకి దూకిన ఇస్రో దిగ్విజయాన సాగిపోవాలని ఆకాంక్షిద్దాం.

మహనీయుల మాట



ఏ విషయాన్నయినా నిగ్రహం కోల్పోకుండా వినగలిగే సామర్థ్యాన్ని విద్య ప్రసాదిస్తుంది.
- రాబర్ట్ ఫ్రాస్ట్


Robert Frost

ఉమ్మడి పౌర స్మృతి అనవసరం!

ఉద్యమం

ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి) ఆవశ్యకతపై మరోసారి అభిప్రాయాలు తెలియ చేయాల్సిందిగా కోరుతూ ... లా కమిషన్ గత నెల 14వ తేదీన పబ్లిక్ నోటీసు జారీ చేసింది. దీనిని దృష్టిలో పెట్టుకుని ... దేశవ్యాప్తంగా కోటికి పైగా సభ్యత్వం కలిగిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తరపున ... లా కమిషన్ సభ్య కార్యదర్శికి మెమోరాండం అందించాం.

- పి.కె.శ్రీమతి, మరియం ధావలె (ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు),
- కీర్తి సింగ్ (న్యాయ సలహాదారు)



అన్ని మతాలకు చెందిన కమ్యూనిటీల్లోనూ పితృస్వామ్య భావజాలంతో కూడిన, వివక్షాపూరితమైన పర్సనల్ చట్టాల భారంతో శతాబ్దాల తరబడి మన దేశంలో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. కేవలం ఏకరీతి (యూనిఫామ్) చట్టాలు తీసుకువచ్చినంత మాత్రాన మహిళలు సమాన హక్కులు పొందలేరు, అలాగే ఈ చట్టాల్లో వివిధ స్థాయిల్లో అంతర్లీనంగా వున్న వివక్షను రూపుమాపలేరు. అందువల్ల యుసిసికి మేం అనుకూలం కాదు. భారతదేశంలో ఈనాడు ఏకరూపత అన్నది అవసరమూ కాదు, వాంఛనీయం కాదు.

గత 40 ఏళ్ళుగా పర్సనల్ లాకి సంబంధించిన అనేక సమస్యలతో ఐద్వా పోరాడుతూ వచ్చింది. ప్రతి రాష్ట్రంలోనూ వివిధ లీగల్ సెల్స్‌లో మహిళల పర్సనల్ లా కేసులను ఎదుర్కొనడంలో క్రియాశీలంగా పనిచేస్తూ వచ్చాం. ప్రతి పర్సనల్ లా లోనూ సంస్కరణలు తీసుకురావడానికి, సమానత్వం తీసుకువచ్చేందుకు, వివక్షను రద్దు చేయడానికి ఐద్వా స్పష్టంగా, నిర్ద్వంద్వంగా కట్టుబడి వుంది. ఉదాహరణకు, ఇతర సంస్కరణలతో పాటూ, హిందూ వారసత్వ చట్టంలో, క్రైస్తవులకు సంబంధించి భారత విడాకుల చట్టంలో సంస్కరణలు తీసుకురావడానికి చురుకుగా కృషి చేస్తోంది. అలాగే మూడుసార్లు తలాక్ చెప్పి విడాకులివ్వడానికి కూడా వ్యతిరేకంగా ప్రచారం చేస్తోంది. వివిధ కమ్యూనిటీల సభ్యులతో ముఖ్యంగా ఈ కమ్యూనిటీలకు చెందిన మహిళలతో సంప్రదింపులు జరపడంతో పాటూ ఈ సంస్కరణల యత్నాలను కొనసాగించాం. పర్సనల్ చట్టాల్లో అంతరం వున్నపుడు లేదా మహిళలకు న్యాయం చేయడానికి ఇటువంటి చట్టాలు తీసుకురావాల్సిన అవసరమున్నపుడు ప్రతి కమ్యూనిటీలోనూ సంస్కరణలకు మద్దతిస్తూ, ఉమ్మడి చట్టాలు తీసుకురావడానికి రెండంచెల వ్యూహాన్ని ఐద్వా పాటిస్తోంది. ఆ రకంగా, వరకట్న చట్టాల్లో, బాల్య వివాహాల నిరోధక చట్టం, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టంలో, గృహ హింస నిరోధక చట్టంలో సంస్కరణలకు మద్దతిస్తూ వాటికోసం సాగిన పోరాటాల్లో ఐద్వా పాల్గొంది.

యుసిసిపై 21వ లా కమిషన్ తన అభిప్రాయాలను విస్పష్టంగా వ్యక్తం చేసినా కూడా మళ్ళీ 22వ లా కమిషన్ ఈ అంశాన్ని పరిశీలించడం ఆశ్చర్యకరంగా వుంది. గణనీయమైన రీతిలో సమానత్వంతో పాటూ మహిళలకు ప్రాథమిక హక్కులతో పర్సనల్ లాని కలిపేందుకు యుసిసి అవసరం కాదని లేదా వాంఛనీయం కూడా కాదన్న మా అభిప్రాయాన్ని 2018లో 21వ లా కమిషన్ కూడా అంగీకరించింది. ఈ అంశంపై 21వ లా కమిషన్ విస్తృతమైన సాక్ష్యాధారాలను తీసుకుంది. విస్తృత పరిశోధన చేపట్టింది. అనేక సెమినార్లలో, చర్చలు, సంప్రదింపుల్లో పాల్గొంది. ఆ తర్వాత యుసిసికి సమయం ఆసన్నమవలేదంటూ అభిప్రాయం వ్యక్తం చేసింది.

లా కమిషన్ ఏం చేయాలనే దానిపై స్పష్టమైన ప్రణాళిక లేకుండా, కేవలం అస్పష్టమైన పదాలతో జారీ చేసిన నోటీసు ద్వారా ఈ ప్రక్రియనంతటినీ మళ్లీ చేపట్టాల్సిన అవసరం వుందని మేము అనుకోవడం లేదు. పైగా, కేవలం నెల రోజుల పరిమిత కాలంలో అభిప్రాయాలు తెలియచేయాలని కోరడం ద్వారా, వివిధ సంస్థలు, లేదా ఈ అంశంపై పని చేసే పలువురు వ్యక్తుల నుండి అభిప్రాయాలు కోరడానికి సీరియస్‌గా ప్రయత్నం జరగడం లేదు. వివిధ బిజెపి పాలిత రాష్ట్రాలు, ప్రధాని ఇటీవల యుసిసికి అనుకూలంగా మాట్లాడినందున యుసిసి కావాలని ఏదో ఒక రకంగా సిపార్సు చేయాలన్నది లా కమిషన్ ఎజెండాగా వున్నట్లు కనిపిస్తోంది. వివిధ మతపరమైన సంస్థలను తమ అభిప్రాయాలు తెలియచేయాలంటూ ప్రత్యేకంగా లా కమిషన్ కోరడం విస్మయానికి గురి చేసింది. మహిళల హక్కులు, సమానత్వానికి సంబంధించిన అంశం యుసిసి, అటువంటపుడు ఈ అంశాలపై పనిచేస్తున్న వారందరికీ, అలాగే ఆ యా కమ్యూనిటీల్లోని మహిళలకు లా కమిషన్ ప్రాధాన్యతనివ్వాలి. అందువల్ల, యుసిసి తీసుకురావడానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ అంశాన్ని పున:పరిశీలించే ప్రస్తుత ప్రక్రియ...అనేక మహిళా సంఘాలు, గ్రూపులు, మైనారిటీ కమ్యూనిటీల ఆకాంక్షలకు పూర్తి విరుద్ధంగా వుంది. ఉత్తరాఖండ్ వంటి బిజెపి పాలిత రాష్ట్రాలు చురుకుగా ఈ ఎజెండాను అనుసరిస్తున్నాయన్నది స్పష్టమైంది. ఉమ్మడి పౌర స్మృతిని తీసుకురావాలన్న తమ ఉద్దేశ్యాన్ని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి బహిరంగంగానే ప్రకటించారు కూడా.

ఈ ప్రభుత్వం లింగ న్యాయానికి ఎన్నడూ ప్రాధాన్యతనివ్వలేదు. మహిళల కోసం ఒక్క సంస్కరణను కూడా తీసుకురాలేదు. హిందూ పర్సనల్ లాల్లో కొన్ని సంస్కరణలు తీసుకురావాలంటూ అనేక డిమాండ్లు వచ్చినా ఈ చట్టాలను మార్చడానికి, ఈ మహిళలకు సమాన చట్టాలు తీసుకురావడానికి ప్రభుత్వం ఒక్క చర్య కూడా తీసుకోలేదు.

కేవలం ప్రస్తుతమున్న ముస్లిం లాని, రాజ్యాంగంలో ఆరవ షెడ్యూల్ కిందకు వచ్చే గిరిజన ప్రాంతాలకు సంబంధించిన చట్టాలను లేకుండా చేసే ప్రయత్నమే ఈ యుసిసి అని బలంగా అభిప్రాయపడుతున్నాం. ప్రజాస్వామ్య నిబంధనలను దృష్టిలో వుంచుకుని, ఆ యా కమ్యూనిటీలతో విస్తృతంగా చర్చించిన తర్వాత మాత్రమే ఇది జరగాలి.

యుసిసి అవసరాన్ని పున:పరిశీలించాలన్న సాకుతో ఏకరూపత చట్టాలను, ప్రధానంగా మెజారిటీవాదుల చట్టాలను తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతాయి. అంతేకానీ మహిళలకు గణనీయంగా సమాన హక్కులు కల్పించే చట్టాలు తీసుకు వచ్చే ప్రయత్నాలు కాదివి. వాస్తవానికి, దీనివల్ల హిందూ చట్టాల నకలు ఏర్పడవచ్చు, అన్ని కమ్యూనిటీల్లో లింగ వివక్ష వుంటుంది.

తమ పిల్లలపై సమాన సంరక్షక హక్కులు లేకపోవడం వల్ల మన దేశంలో హిందూ మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే అత్తింటివారి ఆస్తులపై కూడా వారికి సమాన హక్కులు వుండడం లేదు. వివాహ సమయంలో భార్యాభర్తల్లో ఎవరో ఒకరు, లేదా ఇద్దరు కలిసి సమకూర్చుకున్న ఆస్తే అయినా వాటిపై హక్కు వుండడం లేదు. ఇటీవలే, మద్రాసు హైకోర్టు ఒక కేసులో తీర్పు వెలువరిస్తూ, మహిళలు ఇంట్లో చేసే పనికి కూడా విలువుంటుందని స్పష్టం చేసింది. అందువల్ల ఆమె భర్త సంపాదించిన ఆస్తిలో ఆమెకు కూడా సమాన వాటా వుంటుందని పేర్కొంది. ఆ ఆస్తి ఏర్పాటులో ఆమె ఆర్థికంగా సాయపడినా లేకపోయినా దానిపై హక్కు వుంటుందని తీర్పు చెప్పింది. అయితే, దీనికోసం అనేక మహిళా సంఘాలు, గ్రూపులు అడుగుతున్నా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదు.

కుల దురహంకారం పేరుతో జరిగే నేరాలు, హత్యలను ఎదుర్కొనేందుకు సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని ఐద్వా సహా అనేక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇటువంటి చట్టం కోసం 2005లోనే ఐద్వా ప్రతిపాదనలు పంపింది. ప్రస్తుత ప్రభుత్వానికి కూడా ఇచ్చింది. కానీ ఇంతవరకు ఆ దిశగా ఏమీ జరగలేదు.

అలాగే, యు.పి, ఉత్తరాఖండ్ సహా కొన్ని రాష్ట్రాల్లో వ్యవసాయ భూములపై హిందూ మహిళలకు, ఇతర మహిళలకు సమాన హక్కులు వుండడం లేదు. ఈ రెండు రాష్ట్రాల్లో ఇటువంటి ఆస్తులపై వారసత్వం నుండి వివాహమైన కుమార్తెలను మినహాయిస్తున్నారు. హెచ్‌ఎస్‌ఎ పరిధి నుండి వ్యవసాయ భూమిని తొలగిస్తున్న మినహాయింపును రద్దు చేయడానికి 2005లో హిందూ వారసత్వ చట్టాన్ని సవరించినప్పటికీ, కొన్ని రాష్ట్ర చట్టాల్లో వ్యవసాయ భూమి వారసత్వం కొనసాగుతోంది. ఈ రాష్ట్ర చట్టాలు ఈ వారసత్వపు హక్కును మహిళలు పొందకుండా అడ్డుకుంటున్నాయి. వాస్తవానికి, ఈ చట్టాలను రాజ్యాంగం లోని 9వ షెడ్యూల్‌లో పెట్టారు. కోర్టుల పరిధికి వాటిని వెలుపల వుంచాలనే ఉద్దేశ్యంతోనే ఇలా చేశారు. ఒక హిందూ మహిళ తన స్వంతంగా సంపాదించుకున్న ఆస్తికి, ఆమె భర్త, పిల్లలు లేనపుడు ఆమె కన్నా ఆమె భర్త వారసులకే హక్కు వుంటుందనే అన్యాయమైన నిబంధన హిందూ వారసత్వ చట్టంలో వుంది. దీన్ని కూడా సవరించలేదు.

అలాగే, ప్రత్యేక వివాహ చట్టం కింద వివాహం చేసుకోవాలంటే ముందుగా ఒక నెల నోటీసు ఇచ్చి ఆ కాలపరిమితి ముగిసిన తర్వాతనే వివాహం చేసుకోవాలనే నిబంధనను తొలగిస్తూ, ప్రత్యేక వివాహ చట్టాన్ని సవరించాలని కూడా సూచించాం.

మహిళలకు సమానహక్కులు తీసుకురావడం కోసం ఐద్వాతో సహా పలు ఇతర మహిళా సంఘాలు అనేక సంవత్సరాలుగా కొన్ని సూచనలు చేస్తున్నాయి. అయితే, ఈ డిమాండ్లను గత, ప్రస్తుత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూనే వచ్చాయి. మరోవైపు, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు లవ్ జిహాద్‌ను లేవనెత్తుతూ, మతాంతర, కులాంతర వివాహాలు చేసుకోవడాన్ని నిలువరించేందుకు నిరంకుశమైన మత మార్పిడి చట్టాలు తీసుకువస్తున్నాయి. ఇప్పుడు ఏకరూపత కోసమంటూ ఉమ్మడి పౌర స్మృతిని తీసుకురావాలని కోరుతున్నాయి.

కుటుంబ చట్టాలు లేని రంగాల్లో బహుళ కుటుంబ చట్టాలు (ప్లూరల్ ఫ్యామిలీ లాస్), ఉమ్మడి చట్టాలు రెండూ వున్న సుసంపన్నమైన సాంప్రదాయం భారత్‌కు వుంది. ఇంతకుముందే చెప్పినట్లుగా, వరకట్న నిరోధక చట్టం, సతి అమలు (నిరోధక) చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, గృహ హింస నుండి మహిళలను కాపాడే చట్టం ఇవన్నీ ఉమ్మడి చట్టాలు. అన్ని కమ్యూనిటీలకు వర్తిస్తాయి. అలాగే కుల దురహంకారంతో చేసే హత్యలు, నేరాలను నిరోధించే చట్టం కూడా చేయాలి, అత్తింటివారి ఆస్తిపై సమాన హక్కు వుండేలా చట్టం తీసుకురావాలి. అదే సమయంలో, ఆయా కమ్యూనిటీల్లోని మహిళల, మహిళా ఉద్యమాల ప్రతినిధుల అభీష్టానుసారం పర్సనల్ చట్టాల్లో సంస్కరణలు తీసుకురావాలి. యుసిసిని తీసుకురావాలని ప్రభుత్వం నిశ్చయించింది కాబట్టి కేవలం ఆ కారణంతోనే ఈ అంశాన్ని లా కమిషన్ పున:పరిశీలించవద్దు.

ఈ రంగంలో మాకు వున్న అనుభవాన్ని దృష్టిలో వుంచుకుని, లా కమిషన్ పిలిచిన రోజు వెళ్ళి మౌఖికంగా సాక్ష్యాధారాలు అందచేయాలనుకుంటున్నాం. ఈ అంశంతో సంబంధముండే మహిళా సంఘాలు, ఇతర గ్రూపులు అన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వారితో కూడా లా కమిషన్ విస్తృతంగా చర్చలు జరపాలి. ముఖ్యంగా మైనారిటీ కమ్యూనిటీలకు చెందిన మహిళలతో మాట్లాడాలి. అలాగే గిరిజన మహిళలతో మాట్లాడాలి. ఆ తర్వాతనే యుసిసిపై సిఫార్సు చేయడానికి నిర్ణయం తీసుకోవాలి.

/ లా కమిషన్‌కు ఐద్వా సమర్పించిన మెమోరాండం సంక్షిప్తంగా/

> **ఈ ప్రభుత్వం లింగ న్యాయానికి ఎన్నడూ ప్రాధాన్యతనివ్వలేదు. మహిళల కోసం ఒక్క సంస్కరణను కూడా తీసుకురాలేదు. 'హిందూ పర్సనల్ లా' లో కొన్ని సంస్కరణలు తీసుకురావాలంటూ అనేక డిమాండ్లు వచ్చినా ఈ చట్టాలను మార్చడానికి, ఈ మహిళలకు సమాన చట్టాలు తీసుకురావడానికి ప్రభుత్వం ఒక్క చర్య కూడా తీసుకోలేదు. కేవలం ప్రస్తుతమున్న 'ముస్లిం లా' ని, రాజ్యాంగంలో ఆరవ షెడ్యూల్ కిందకు వచ్చే గిరిజన ప్రాంతాలకు సంబంధించిన చట్టాలను లేకుండా చేసే ప్రయత్నమే ఈ యుసిసి అని బలంగా అభిప్రాయపడుతున్నాం.**

జిఎస్‌టి ప్రస్థానంలో సామాన్యులే సమిధలు

అభిప్రాయం



> **రాష్ట్రాల అధికారాలకు, హక్కులకు తీవ్ర భంగం వాటిల్లుతోందనే భావన, రాజ్యాంగం కల్పించిన సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా జిఎస్‌టి పయనిస్తోందనే విమర్శలతోపాటు, ఆరు సంవత్సరాల గమనంలో అనేక సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. ఆరోగ్య సంరక్షణ, ఆతిథ్యం, విద్యుత్, ఇన్సూరెన్స్ వంటి వివిధ కీలక రంగాలను జిఎస్‌టి పరిధి నుంచి మినహాయించటం, శ్లాబులను హేతుబద్ధీకరించటం తక్షణ అవసరం.**



జి. కిషోర్ కుమార్

దేశంలో అతి పెద్ద పన్నుల సంస్కరణగా, 'ఒకే దేశం-ఒకే పన్ను' నినాదంతో కేంద్రంలోని బిజెపి తీసుకొచ్చినదే 'గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్' (జిఎస్‌టి). ఈ విధాన రూపకల్పన ప్రస్థానం 2023 జూన్‌కు ఆరేళ్ల కాలాన్ని, జులై 11వ తేదీతో 50 జిఎస్‌టి కౌన్సిల్ సమావేశాలను పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖామంత్రి 'జిఎస్‌టి కౌన్సిల్ - ప్రయాణం దిశలో 50 అడుగులు' అనే లఘు చిత్రాన్ని విడుదల చేశారు. ఈ మాటలు ఎంతో వినసొంపుగా అనిపించినప్పటికీ దీని ప్రవేశిక మొదలు నుంచి నేటివరకు కూడా జిఎస్‌టి ప్రస్థానంలో సామాన్యులే సమిధలని చెప్పక తప్పదు. 122వ రాజ్యాంగ సవరణ బిల్లు (101వ సవరణ చట్టం) ద్వారా 2016లో జిఎస్‌టి చట్టాన్ని ఆమోదించి, అమలుకు అంకురార్పణ చేశారు. రాష్ట్రంలో ఏదైనా వస్తువుల సరఫరా లేదా సేవలు పొందినప్పుడు కేంద్ర ప్రభుత్వానికి చెల్లించేందుకు నిర్దేశించిన సెంట్రల్ జిఎస్‌టి (సిజిఎస్‌టి), రాష్ట్రంలో ఏదైనా వస్తువులు సరఫరా చేసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్ళే పన్నుకు సంబంధించిన రాష్ట్ర జిఎస్‌టి (ఎస్‌జిఎస్‌టి), అంతర్రాష్ట్ర వ్యాపారం లేదా వాణిజ్యంలో భాగంగా వస్తువులు, సేవల సరఫరాపై విధించే సమగ్ర వస్తుసేవల పన్ను (ఐజిఎస్‌టి)గా, జిఎస్‌టి విధాన ప్రక్రియను వర్గీకరించారు. ఈ విధాన ప్రక్రియలో ఇప్పటివరకు 60 వేల రిజిస్ట్రేషన్లు నకిలీవిగా భావించి 43 వేల రిజిస్ట్రేషన్ల ప్రాంతాలలో సోదాలు జరిపి 11,140 నకిలీవిగా తేల్చారు. ఇటీవల జరిగిన 50వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో, ఆన్‌లైన్ గేమింగ్ ముఖవిలువలో 28 శాతం టాక్స్ విధింపునకు నిర్ణయం తీసుకుంది. హార్స్‌రేసింగ్, క్యాసినోలకు కూడా ఈ రేటు వర్తించనుంది. క్యాన్సర్ సంబంధిత ఔషధాలు, అరుదైన వ్యాధులకు వినియోగించే కొన్ని మందులు, ప్రత్యేక వైద్య పరిస్థితులలో అవసరమయ్యే కొన్ని ఆహార ఉత్పత్తులను జిఎస్‌టి నుంచి మినహాయిస్తూ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం ఆహ్వానించదగ్గ పరిణామం. ఇదంతా నాణానికి ఒకవైపు మాత్రమే.

మరోవైపు జిఎస్‌టి వల్ల పెద్ద ఎత్తున నష్టపోయింది బడుగు, బలహీన వర్గాల ప్రజలు. జిఎస్‌టి రూపకల్పనతో ధరలు తగ్గేందుకు వీలు కలిగి పేద రాష్ట్రాలు లాభపడతాయని, సులభమైన, సమ్మిళిత పన్ను రేట్లతో ఏకరూపత, మెరుగైన పోటీతత్వం, సులభ నిర్వాహణా సౌలభ్యం, అధిక రాబడి సామర్థ్యం, మొత్తం పన్ను రాబడి నుంచి ఉపశమనం వంటి ప్రయోజనాలు చేకూరతాయని ఉద్దేశించిన లక్ష్యం సాకారం కాలేదు. వివిధ రకాల వస్తు సేవలను 1 శాతం, 5, 12, 18, 28 శాతం జిఎస్‌టి పన్ను శ్లాబుల పరిధిలోకి వచ్చేలా చూసింది. అయితే అది సామాన్యుడి ఆదాయమే ప్రాతిపదికగా పన్నుల పరిధి విస్తృతమవుతున్న నేపథ్యంలో పన్నుల వ్యవస్థ అసమానతలకు జిఎస్‌టి ప్రక్రియ పరిష్కారం చూపలేదు. జిఎస్‌టి అమలు ప్రారంభం నుంచి 50వ కౌన్సిల్ సమావేశం వరకు సుమారు 1500 నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొంటున్నప్పటికీ వీటిలో సామాన్యుడికి స్వాంతన చేకూర్చినవి అతి తక్కువ. కానీ ప్రభుత్వానికి ఉపయోగపడింది ఎక్కువే. ఈ ఆరేళ్ల జిఎస్‌టి అమలు ప్రస్థానంలో, దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తం పన్ను ఆదాయంలో సగానికి పైగా జిఎస్‌టి ద్వారానే సమకూరింది. తాజాగా ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ.18.10 లక్షల కోట్ల మేరకు జిఎస్‌టి రూపంలో దేశ ఆర్థిక వ్యవస్థ పన్ను ఆదాయాన్ని ఆర్జించింది. అశేష ప్రజానీకం వినియోగించే అత్యవసర, నిత్యావసర వస్తుసేవలపై జిఎస్‌టి భారాన్ని మినహాయించాలనే డిమాండ్లు ఉన్నా వాటిని కేంద్రం పట్టించుకోవడం లేదు. ధరల నియంత్రణ యంత్రాంగంపై మార్కెట్ శక్తులు ఆధిపత్యం చెలాయిస్తున్న ప్రస్తుత తరుణంలో ఆకాశాన్నంటుతున్న నిత్యావసర, అత్యవసర వస్తుసేవల శ్లాబురేట్లను హేతుబద్ధీకరించి, ఉపశమనం కలిగించటం అత్యంత ఆవశ్యకం.

గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ నెట్‌వర్క్‌ను, ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ పరిధిలోనికి తీసుకువస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిర్ణయంతో జిఎస్‌టి నెట్‌వర్క్ కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి), ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్‌ఐయూ)లతో సమాచారాన్ని పంచుకోవాల్సిన సంస్థల జాబితాలోకి చేరింది. దీని ప్రకారం ఎవరైనా జిఎస్‌టి మదింపుదారులు అనుమానాస్పద విదేశీ కరెన్సీ లావాదేవీలు చేసినట్లయితే వారి వివరాలను సదరు సంస్థలు జిఎస్‌టి నెట్‌వర్క్‌కు షేర్ చేయడం జరుగుతుంది. వీటితో పాటు వివిధ నియంత్రణా సంస్థలు కూడా సమాచారాన్ని జిఎస్‌టి నెట్‌వర్క్‌తో పంచుకోవాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం పట్ల బిజెపి యేతర పార్టీల ప్రభుత్వాలున్న వివిధ రాష్ట్రాలు ఆందోళనను వెలిబుచ్చాయి.

50వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో ప్రయివేటు కంపెనీలు అందించే ఉపగ్రహ ప్రయోగ సేవలను జిఎస్‌టి నుంచి మినహాయించారు. దీనిపై విమర్శలు వెలువడ్డాయి. ఎస్‌యువిల నిర్వచనంలో నాలుగు ప్రమాణాలుగా మార్పులను ప్రతిపాదించారు. పన్ను రిటర్న్ దాఖలులో గందరగోళ, అనిశ్చితి పరిస్థితులను సరిదిద్ది, జిఎస్‌టి వ్యవస్థను సరళీకరించి పన్ను పరిధిని విస్తృత పరిచే దిశగా, వ్యవస్థాగత సంస్కరణలలో భాగంగా ఫిజికల్ వెరిఫికేషన్, బయోమెట్రిక్, జియో ట్యాగింగ్, ఎలక్ట్రానిక్ వేబిల్స్, బ్యాంక్ అకౌంట్లకు సంబంధించి ఎలక్ట్రానిక్ డేటాను, కృత్రిమ మేధను వినియోగించటం, జిఎస్‌టి ఆడిట్ వంటి విధానాలకు రూపకల్పన జరుగుతోంది. జిఎస్‌టిఆర్-9, జిఎస్‌టిఆర్-9సి వంటి అంశాలలో గత ఆర్థిక సంవత్సరంలో కల్పించిన రాయితీలను ఈ ఆర్థిక సంవత్సరానికి కూడా కొనసాగిస్తామన్నారు.

సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ, అదనపు ఎక్సైజ్ సుంకం, సేవా పన్ను, అదనపు కస్టమ్స్ డ్యూటీ, రాష్ట్రాలు విధించే విలువ ఆధారిత పన్ను, అమ్మకపు పన్ను, వినోదపు పన్ను, విలాస పన్ను, ఆక్ట్రాయ్ పన్ను, ప్రవేశ పన్ను, కొనుగోలు, ప్రకటనల పన్ను వంటి 17 రకాల పెద్ద పన్నులను, 13 రకాల సెస్‌లను విలీనం చేసి జిఎస్‌టిని అమలులోకి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆదాయ వనరుల రెవెన్యూ షేరింగ్ ఫార్ములాకు మార్పులు చేయాలని వివిధ రాష్ట్రాల నుంచి డిమాండ్ కొనసాగుతోంది. కేంద్రం మాత్రం పట్టించుకోవడం లేదు.

జిఎస్‌టి పాలనా కాలంలో అతి కొద్ది రాష్ట్రాలు మాత్రమే వృద్ధిరేటును సాధించాయి. రాష్ట్రాల అధికారాలకు, హక్కులకు తీవ్ర భంగం వాటిల్లుతోందనే భావన, రాజ్యాంగం కల్పించిన సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా జిఎస్‌టి పయనిస్తోందనే విమర్శలతోపాటు, ఆరు సంవత్సరాల గమనంలో అనేక సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. ఆరోగ్య సంరక్షణ, ఆతిథ్యం, విద్యుత్, ఇన్సూరెన్స్ వంటి వివిధ కీలక రంగాలను జిఎస్‌టి పరిధి నుంచి మినహాయించటం, శ్లాబులను హేతుబద్ధీకరించటం తక్షణ అవసరం. మొత్తం జిఎస్‌టి వసూళ్ళలో... 50 శాతంగా ఉన్న పేదవారి వాటా 64 శాతం, 40 శాతంగా ఉన్న మధ్యతరగతి వాటా 33 శాతం, పది శాతంగా ఉన్న సంపన్న వర్గం వాటా కేవలం 3 శాతంగా ఉన్నదనే విశ్లేషణ, ఆరు సంవత్సరాల జిఎస్‌టి ప్రస్థానంలో 'సామాన్యులే సమిధ'లనే అంశాన్ని ప్రస్ఫుటిస్తోంది.

/ వ్యాసకర్త ఎస్‌సిజడ్‌ఐఇఎఫ్ జాయింట్ సెక్రటరీ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ఎల్‌ఐసి ఉద్యోగ సంఘం), సెల్ : 9440905501/

జనవాక్యం

రాకెట్ పూజలు సైన్స్‌కు అవమానం

ప్రపంచవ్యాప్తంగా ఒకపక్క సైన్సు అభివృద్ధి చెందుతున్నది. ఇతర గ్రహాలలో కాపురం పెట్టేందుకు మానవుడు ఉరకలు వేస్తున్నాడు. కానీ రాకెట్ తయారు చేసి పైకి పంపే ఇస్రో ఛైర్మన్ ప్రతి ప్రయోగానికి ముందు చెంగాళమ్మకు, తిరపతి వెంకన్నకు దణ్ణంపెట్టి ప్రయోగం విజయవంతం చెయ్యమని మొక్కటం చాలా సిగ్గుచేటైన విషయం. అంతే కాదు. శాస్త్రవిజ్ఞానాన్ని అవమానించడమే. సైన్స్‌ను అపహాస్యం చెయ్యటమే అవుతుంది. రేపటి తమ ప్రయోగం విజయవంతం కావాలని దణ్ణం పెట్టుకోవటం ఎంతవరకు సమంజసం? అంటే ఇస్రో వారు చేసిన కృషి మీద నమ్మకం లేకనా! తాను చేస్తున్న సంస్థ మీద నమ్మకం లేని ఇస్రో ఛైర్మన్ ఆ పదవికి అనర్హుడుగా ప్రకటించాలి. ఇంత పెద్ద సంస్థ ఛైర్మన్ ఇలా దణ్ణాలు పెడుతున్నాడు... ఇంకా మనమెంత అని సామాన్యుడు కూడా మూఢ నమ్మకాలను ఆశ్రయించే అవకాశం లేకపోలేదు. పెద్దపెద్ద పదవులలో ఉన్నవారు రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలి. ప్రజలు వీరిని అనుసరిస్తారు. కనుక ఇప్పటికయినా ఇస్రో ఛైర్మన్ ఇలాంటి అప్రజాస్వామికమైన, మూఢనమ్మకాలను పెంచే కార్యక్రమాలను మానుకోవాలి. చదువుకున్నవారు మిగిలిన వారికి ఆదర్శంగా ఉండాలి. రాజ్యాంగం లోని ఆర్టికల్ 51ఎ (హెచ్)లో రాసుకున్న సూత్రాలను ప్రమోట్ చెసేవిధంగా అధికారుల ఆలోచనలు ఉండాలి. చదువుకున్నవారు వారి సొంత నమ్మకాలను పక్కనపెట్టి, శాస్త్రీయంగా సమాజాన్ని ఏ విధంగా ముందుకు తీసుకుపోవాలన్న కనీస అలోచనతో పని చేయాలి.

- మేఘమాల, ఒంగోలు.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

మణిపూర్ విధ్వంసానికి 'డబుల్ ఇంజిన్' మద్దతు

- సొంతపార్టీపై నిప్పులు చెరిగిన మిజోరం బిజెపి నేత
- పార్టీకి ఉపాధ్యక్షుడు వన్లమ్ముంగం రాజీనామా
- కేంద్ర హోంమంత్రి అమిత్ షాపైనా విమర్శలు



ఐజ్వాల్ : మణిపూర్‌లో హింసాకాండ చెలరేగడానికి, గిరిజన తెగల మధ్య విద్వేషాలకు అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాలే కారణమని కాషాయ పార్టీకి చెందిన సీనియర్ నేత వన్లమ్ముంగం నిప్పులు చెరిగారు. రెండు నెలలుగా మణిపూర్‌లో కొనసాగుతున్న తెగల మధ్య ఘర్షణలకు 'డబుల్ ఇంజిన్' బిజెపి ఉండటాని మోడీ ఈ డబుల్ ప్రధానకారణమని ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో బిజెపియే అధికారంలో ఉంటే ప్రగతి పరుగులు దీస్తుందని పేర్కొంటూ 'డబుల్ ఇంజన్' నినాదాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎక్కడ ఎన్నికలు జరిగినా పదేపదే ప్రస్తావిస్తారని సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ డబుల్ ఇంజన్ పలు రాష్ట్రాల్లో విధ్వంసానికి కారణమవుతోందన్న విమర్శలు ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయి. ఇప్పుడు సొంత నేతలే బిజెపి తీరును ఎండగట్టి రాజీనామాలు చేస్తుండటం గమనార్హం. ఈ క్రమంలో మిజోరం బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. వన్లమ్ముంగం ఆ పార్టీకి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖలో మణిపూర్, కేంద్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆయన ఆరోపణలు సంధించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మణిపూర్‌లో చర్చిలకు నిప్పంటిస్తూ విధ్వంసానికి పాల్పడుతున్న మెయితీ చర్యలకు మద్దతిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెయితీల ద్వారా మొత్తం 357 చర్చిలు, పాస్టర్ క్వార్టర్లు, వివిధ చర్చిల కార్యాలయ భవనాలు కాలి బూడిదయ్యాయని ఆయన ఆరోపించారు. "క్రిస్టియన్లు, క్రిస్టియన్ మతానికి జరుగుతున్న నేరపూరిత అన్యాయానికి వ్యతిరేకంగా నిరసన తెలపడానికి మిజోరం బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవికి తక్షణమే రాజీనామా చేస్తున్నాను" అని మిజోరం బిజెపి అధ్యక్షుడికి రాసిన లేఖలో వన్లమ్ముంగం పేర్కొన్నారు.

మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్ కానీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కానీ చర్చిలను తగలబెట్టే ఘటనలను ఖండిస్తూ ఒక్క మాటా మాట్లాడలేదని ఆరోపించారు. కేంద్రం నుంచి కూడా ఇదే తీరు ఉన్నదని వివరించారు. కాబట్టి మణిపూర్‌లో పెద్ద ఎత్తున చర్చిలను ధ్వంసం చేసే ఘటనల వెనక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు ఉన్నదని తాను విశ్వసిస్తున్నట్టు పేర్కొన్నారు. బిజెపి క్రిస్టియన్ వ్యతిరేక పార్టీ అని వచ్చే ఆరోపణలకు ఇవి బలాన్ని చేకూర్చాయని ఆరోపించారు. "ముండగుల దుశ్చర్యలపై రాష్ట్ర నాయకులు, సెంట్రల్ లీడర్లు ఖండనను తెలియజేయలేదు. బాధితుల రక్షణ, ఓదార్పుకోసం ఏదో ఒకటి చేయాల్సింది. మిజోరంలో అత్యధికం క్రిస్టియన్ల బిజెపి.. క్రిస్టియన్ల వ్యతిరేక పార్టీ అని మణిపూర్‌లో వెల్లడైంది. బిజెపి నిజంగానే క్రిస్టియన్ల వ్యతిరేక పార్టీ అని ప్రజలు చెప్తున్నారు. ఒక చర్చి నాయకుడినైనా నేను బిజెపిలో ఉండకూడదు" అని వన్లమ్ముంగం వివరించారు. ఈ ఏడాది మే 3న మణిపూర్‌లో మెయితీలు, కుకీల మధ్య ఎస్టీ హోదా కల్పించే విషయంలో వివాదం చెలరేగి తీవ్ర హింసకు దారి తీసిన విషయం తెలిసిందే. ఇది మత ఘర్షణలకు కారణమై వందల మంది ప్రాణాలు కోల్పోవడానికి దారి తీసింది.

యుసిసిపై 28 వరకు గడువు పెంపు !

న్యూఢిల్లీ : ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి)పై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియచేసేందుకు గడువును ఈ నెల 28 వరకు లా కమిషన్ పొడిగించింది. యుసిసిపై ప్రజలు, సంస్థలు తమ అభిప్రాయాలను తెలియచేయాల్సిందిగా జూన్ 14న లా కమిషన్ కోరింది. ఇచ్చిన ఒక నెల గడువు శుక్రవారంతో ముగిసింది. దాంతో మరో 14 రోజులు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ అంశంపై ప్రజల నుండి అధిక రీతిలో ప్రతిస్పందనలు వస్తున్నాయని, తమ వ్యాఖ్యలు తెలియచేయడానికి మరికొంత సమయం కావాలంటూ వివిధ వర్గాల నుండి లెక్కకు మించి అభ్యర్ధనలు వచ్చాయని లా కమిషన్, పబ్లిక్ నోటీసులో తెలిపింది. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు లేదా సంఘాలు ఈ అంశంపై 28వ తేదీలోగా లా కమిషన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాలని కోరింది.

మోడీకి ఫ్రాన్స్ అత్యున్నత పురస్కారం ప్రదానం

పారిస్ : ఫ్రాన్స్ అత్యున్నత పౌర, సైనిక పురస్కారమైన గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది లీజియన్ ఆఫ్ ఆనర్‌ను ప్రధాని నరేంద్ర మోడీకి ఫ్రెంచి అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ అందచేశారు.

ఈ పురస్కారం అందుకున్న మొదటి భారత ప్రధాని మోడీనే. గురువారం ఎలిసీ ప్యాలెస్‌లో అవార్డు ప్రదానం జరిగింది. గతంలో ఈ అవార్డు అందుకున్న నెల్సన్ మండేలా, కింగ్ చార్లెస్, ఏంజెలా మెర్కెల్ వంటి ప్రముఖుల జాబితాలో మోడీ చేరారు. 1802లో నెపోలియన్ బోనాపార్టీ నెలకొల్పిన ఈ అవార్డు ఫ్రెంచి జాతీయులకే పరిమితమైనా, ఫ్రాన్స్‌కు సేవలందించిన లేదా ఫ్రాన్స్ విలువలు, ఆదర్శాలను పరిరక్షించిన వారికి కూడా లీజియన్ ఆఫ్ ఆనర్ అందచేస్తారు. అంతకుముందు ప్యాలెస్‌లో మోడీకి మాక్రాన్ దంపతులు ప్రైవేట్ విందు ఏర్పాటు చేశారు. 'భాగస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబించే చర్య ఇది' అని విదేశాంగ శాఖ ప్రతినిధి అరిందమ్ బగ్చి ట్వీట్ చేశారు. ఈ పురస్కారానికి గానూ భారత ప్రజల తరపున మోడీ కృతజ్ఞతలు తెలియచేశారని పేర్కొన్నారు.

పెట్టుబడులతో రండి..

రెండు రోజుల అధికార పర్యటనకు ఫ్రాన్స్ వచ్చిన మోడీ గురువారం సాయంత్రం అక్కడి భారతీయుల సమావేశంలో ప్రసంగించారు. ఫ్రాన్స్‌లో యుపిఐ వాడుకునేందుకు ఒప్పందం కుదిరినట్లు ప్రకటించారు. దీంతో నగదు రహిత చెల్లింపులకు భారత్ ఆవిష్కరణకు పెద్ద మార్కెట్ లభించింది. భారత్‌లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా అక్కడి భారతీయులకు పిలుపిచ్చారు. పెట్టుబడుల కేంద్రంగా భారత్‌ను అంతర్జాతీయ నిపుణులు గుర్తిస్తున్నారని అన్నారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, కొత్త వ్యవస్థ దిశగా ప్రపంచం ముందుకెళుతున్నపుడు భారత్ పాత్ర, బలం కూడా చాలా వేగంగా మారుతున్నాయని అన్నారు. మార్సిల్లెలో కొత్త భారత కాన్సులేట్‌ను ప్రారంభిస్తున్నట్లు మోడీ ప్రకటించారు. భారత్, ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి 25 ఏళ్ళు నిండాయన్నారు. రెండు దేశాల ప్రజల మధ్య సంబంధాలే ఈ భాగస్వామ్యానికి పునాది అని మోడీ వ్యాఖ్యానించారు. శుక్రవారం ఫ్రాన్స్ జాతీయ దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా మోడీ పాల్గొన్నారు. అనంతరం ఇరువురు నేతలు ద్వైపాక్షిక సమావేశం జరిపారు.



మోడీకి ఫ్రాన్స్ అత్యున్నత పురస్కారం గ్రాండ్ క్రాస్ మెడల్ బహుకరిస్తున్న మాక్రాన్

నిరసనల వెల్లువ

ఫ్రాన్స్‌లో నరేంద్ర మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ స్థానిక ప్రజానీకం పలు చోట్ల ఆందోళనలు, ప్రదర్శనలు చేపట్టారు. మానవ హక్కులను హరించివేస్తున్న ప్రధాని మోడీని స్వాగతించేందుకు ఇక్కడ ఎవ్వరూ సిద్ధంగా లేరని రాసివున్న ప్లకార్డులు ప్రదర్శించారు. మోడీ భారీ దిష్టిబొమ్మలతో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. స్వేచ్ఛా, విముక్తి పోరాటాల దిగ్విజయానికి ప్రతీక అయిన 'బాస్టీల్ డే' వేడుకులకు మోడీని ముఖ్య అతిథిగా ఆహ్వానించడం సిగ్గు చేటు అని నినదించారు.

జ్ఞానవాపీ సర్వేపై 21న వారణాసి కోర్టు తీర్పు

వారణాసి : కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఉన్న జ్ఞానవాపీ మసీదులో శాస్త్రీయ సర్వే నిర్వహించాలని కోరుతూ దాఖలైన పిటీషన్‌పై వారణాసిలోని కోర్టు విచారణను ముగించింది. తీర్పును ఈ నెల 21కి రిజర్వ్ చేసింది. మసీదు ప్రాంగణం మొత్తాన్ని సర్వే చేసేలా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్ఐ)కి ఆదేశాలు ఇవ్వాలని కొంత మంది హిందువులు ఈ పిటీషన్ దాఖలు చేశారు.

అజిత్ పవార్‌కు ఆర్థిక శాఖ

ముంబయి : మహారాష్ట్ర మంత్రివర్గంలో అజిత్ పవార్ గ్రూపు ఎమ్మెల్యేలకు కీలక మంత్రి పదవులు కేటాయించారు. ఎన్‌సిపి నుంచి విడిపోయి ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంలో మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన సుమారు రెండువారాల తరువాత ఈ 9 మంది ఎమ్మెల్యేలకు శుక్రవారం మంత్రిత్వ శాఖలను కేటాయించారు. ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అజిత్ పవార్‌కు ఆర్థిక, ప్రణాళిక శాఖలను కేటాయించారు. భగన్ భుజబల్‌కు ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల రక్షణ శాఖను కేటాయించారు. అదిత తట్కరేకు మహిళా శిశు సంక్షేమ శాఖను కేటాయించారు. షిండే ప్రభుత్వంలో ఏకైక మహిళా మంత్రి ఆదిత కావడం విశేషం.



చంద్రయాన్-3 నమూనాను ప్రదర్శిస్తున్న కేంద్ర సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్

నిప్పులు కక్కుకుంటూ.. నింగికెగసిన చంద్రయాన్-3

మొదటి పేజీ తరువాయి

భారత్ నిలుస్తుంది. చంద్రునికిపైకి రోవర్ పంపేందుకు అమెరికాకు నాలుగు రోజులు పడితే, రష్యాకు ఒకటిన్నర రోజే పట్టింది. భారత్‌కు మాత్రం 42 రోజులు పడుతుంది. ఎందుకంటే మనం ఉపయోగించే రాకెట్ అమెరికా, రష్యా అంత శక్తివంతమైనది కాదు. అమెరికా, రష్యా దేశాలు ఇప్పటికే చంద్రమండలంపైకి మానవ వ్యోమగాములను కూడా పంపాయి. భూమికి 3.84 లక్షల కి.మీ దూరంలో ఉన్న చంద్రునిపైకి నేరుగా వెళ్లాలంటే శక్తివంతమైన రాకెట్ అవసరం. అటువంటి సామర్థ్యం లేనందున ఎల్‌విఎం3 ఎం4 రాకెట్ సాయంతో తక్కువ ఖర్చుతో చంద్రయాన్-3 ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది.

తొలుత భూమి చుట్టూ దీర్ఘ వృత్తాకారంలో ఉన్న కక్ష్యలో ప్రవేశించి 24 రోజుల పాటు అందులోనే చక్కర్లు కొడుతూ, క్రమంగా తన కక్ష్యను పెంచుకుంటూ చంద్రుని గురుత్వాకర్షణ క్షేత్రంలోకి చేరుతుంది. ఈ ప్రక్రియ అంతా పూర్తి కావడానికి 42 రోజులు పడుతుంది. 2008లో ఇస్రో నిర్వహించిన చంద్రయాన్-1 విజయవంతమైనా, 2019లో చంద్రయాన్-2 చివరి నిమిషంలో విఫలమైంది. ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ బుధవారం నుంచీ షార్‌లోనే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలతో సమీక్షించారు. చంద్రున్ని లోతుగా అధ్యయనం చేసి, అక్కడ దాగున్న అనేకానేక రహస్యాలను వెలికి తీయడమే చంద్రయాన్-3 ప్రయోగం ప్రధాన లక్ష్యం. ఇప్పటి దాకా ఎన్నో దేశాలు చంద్రునికి ముందు వైపు అంటే ఉత్తర ధ్రువంపై పరిశోధనలు చేశాయి. భారత్ మాత్రం చంద్రయాన్-1 నుంచి తాజా చంద్రయాన్-3 వరకూ చంద్రుని వెనుక వైపు, అంటే దక్షిణ ధ్రువాన్ని పరిశోధించేందుకే ప్రయత్నిస్తూ వస్తోంది. అందులో భాగంగా చంద్రయాన్-3 ల్యాండర్‌ను సూర్యరశ్మి పడని చంద్రుని దక్షిణ ధ్రువపు చీకటి ప్రాంతంలో దించనున్నట్లు తెలిపారు.

చంద్రయాన్-3 ప్రయోగం విజయం సాధించడంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్, ప్రధానమంత్రి మోడీ శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. భారత అంతరిక్ష చరిత్రలో ఇది ఒక కొత్త అధ్యాయమని మోడీ ట్వీట్ చేశారు. సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ప్రయోగం విజయవంతంపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పందిస్తూ ఇది దేశానికి చారిత్రాత్మక విజయమని అభివర్ణించారు. ఈ విజయం దేశంలో ప్రజలందరికీ గర్వకారణమైన క్షణమని, అంతరిక్ష పరిశోధనలో ఈ మిషన్ సంచలనాత్మక ఫలితాలను తెస్తుందని విజయన్ ట్వీట్ చేశారు. అలాగే, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ తదితరులు అభినందనలు తెలిపారు. చంద్రయాన్-3 బరువు 3,920 కిలోలు. ఇందులో ప్రొపల్షన్ మాడ్యూల్ 2,145 కిలోలు, ల్యాండర్ 1,749 కిలోలు, రోవర్ 26 కిలోలుంటాయి. చంద్రయాన్-2లో 14 పేలోడ్స్ పంపగా చంద్రయాన్-3లో 5 ఇస్రో పేలోడ్స్ మాత్రమే పంపారు. చంద్రయాన్-3 ప్రపొల్షన్ మాడ్యూల్, ల్యాండర్, రోవర్లలో అత్యాధునిక సాంకేతిక పరికరాలను అమర్చి పంపారు.

చంద్రయాన్ 2 ప్రయోగం విజయవంతమైన సందర్భంగా గూడూరు పట్టణంలోని సాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు 'ఆల్‌ది బెస్ట్ ఇస్రో' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

గవర్నర్ నజీర్, సిఎం జగన్ హర్షం

చంద్రయాన్-3 విజయవంతం కావడం పట్ల రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురంధరేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు. చంద్రునిపై ఎటువంటి ఆటంకాలూ లేకుండా ల్యాండ్ కావాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

పెను సవాల్‌గా పోషకాహార లోపం

- ఐక్యరాజ్య సమితి

న్యూయార్క్ : ప్రపంచవ్యాప్తంగా 240 కోట్ల మంది ప్రజలకు గతేడాది ఆహారం నిరంతరంగా లభించ లేదని ఐక్యరాజ్య సమితి తెలిపింది. 78.3 కోట్ల మంది ప్రజలు క్షుద్బాధను ఎదుర్కొన్నారని, 14.8 కోట్ల మంది చిన్నారులు పోషకాహారం లోపంతో ఎదుగుదల వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపింది. 2021, 2022 సంవత్సరాల మధ్య కాలంలో ఆకలితో బాధపడే వారి సంఖ్యలో పెరుగుదల లేదని, కానీ చాలా ప్రాంతాలు తీవ్రమైన ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయని పేర్కొంది. పశ్చిమాసియా, కరేబియన్ ప్రాంతాల్లో, ఆఫ్రికా ఖండంలోని 20శాతం జనాభా క్షుద్బాధను ఎదుర్కొన్నారు. ఇది, ప్రపంచ సగటు కన్నా రెట్టింపునకు పైగానే వుంది. అలాగే కరోనా నుండి ప్రపంచ దేశాలు కోలుకునే తీరు కూడా అంతటా సమానంగా లేదని ఆహారం, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) డైరెక్టర్ జనరల్ క్యూ డోంగ్యూ పేర్కొన్నారు. పైగా ఉక్రెయిన్‌లో యుద్ధం పోషకాహారం, ఆరోగ్యకరమైన ఆహారాన్ని బాగా ప్రభావితం చేసిందన్నారు. "వాతావరణ మార్పులు, ఘర్షణలు, ఆర్థిక అస్థిరత వంటివన్నీ ప్రజలను భద్రత నుండి మరింత దూరంగా తోస్తున్నపుడు ఇదే 'కొత్త రకమైన సాధారణ పరిస్థితి' అని ఆయన వ్యాఖ్యానించారు. 2021లో ప్రపంచ జనాభాలో 42శాతం మంది అంటే 310 కోట్ల మంది ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం లభించలేదని ఆ నివేదిక పేర్కొంది.

2019లో ఈ సంఖ్య కేవలం 13.4 కోట్లుగా వుందని తెలిపింది. అనారోగ్యరమైన ఆహారానిన తీసుకునే వారి సంఖ్య తగ్గించడమనేది పెద్ద సవాలుగా పరిణమించిందని ఎఫ్ఎఓ ప్రధాన ఆర్థికవేత్త మాక్సిమో టోరెకో చెప్పారు. వ్యవసాయ రంగంలో, వ్యవసాయాధారిత ఆహార వ్యవస్థలో మన వనరులను ఉపయోగించుకునే తీరులో గణనీయంగా మార్పులు రావడమే ఇందుకు కారణమన్నారు. తాజా పరిశోధన ప్రకారం 2022లో తీవ్రంగా పోషకాహార లోపంతో బాధపడేవారి సంఖ్య సగటున 73.5 కోట్లుగా వుందన్నారు. కోవిడ్ ప్రారంభం కావడానికి ముందు 2019లోని సంఖ్య కన్నా 12.2 కోట్లు ఎక్కువగా వుందని చెప్పారు.

చైనా దౌత్యవేత్తతో జైశంకర్ భేటీ

జకర్తా : చైనా దౌత్యవేత్త వాంగ్ యితో భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ గురువారం సమావేశమయ్యారు. జకర్తాలో జరుగుతున్న ఆసియాన్ ప్రాంతీయ ఫోరం (ఎఆర్ఎఫ్) మంత్రివర్గ సమావేశం నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. ఈ భేటీలో భారత్-చైనా సరిహద్దుల వెంబడి నెలకున్న పరిస్థితులపై చర్చించారు. మార్చిలో జి-20 విదేశాంగ మంత్రుల సమావేశం కోసం భారత్ వచ్చిన సందర్భంలో చైనా విదేశాంగ మంత్రి క్విన్ గ్యాంగ్ ఇక్కడ జైశంకర్‌తో ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్నారు.

అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమే !

- అమెరికా సెనెట్ కమిటీ

శాన్‌ఫ్రాన్సిస్కో: అరుణాచల్ ప్రదేశ్‌ను భారత్‌లో అంతర్భాగంగా గుర్తిస్తూ అమెరికా సెనెట్ కమిటీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. భారత ప్రధాని నరేంద్ర మోడీ అమెరికాలో పర్యటించి నెల రోజులు కూడా గడవకముందే సెనెట్ ఈ చర్య తీసుకుంది. మెక్‌మహన్ రేఖను చైనాకు, భారత్‌కు మధ్య గల అంతర్జాతీయ సరిహద్దుగా అమెరికా గుర్తించిందని తీర్మానం పేర్కొంది.

కునో నేషనల్ పార్క్‌లో మరో చీతా మృతి

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్‌లో మరో చీతా మృతి చెందింది. నమీబియా నుంచి తీసుకొచ్చిన సూరజ్ శుక్రవారం మరణించింది. గత ఐదు నెలల్లో ఇక్కడ మరణించిన ఎనిమిదవ చీతా ఇది. కొన్ని రోజుల క్రితం మంగళవారం దక్షిణాఫ్రికా నుంచి తీసుకుని వచ్చిన చీతా తేజాస్ మంగళవారం మరణించిన సంగతి తెలిసిందే. సూరజ్ మరణానికి ఇంకా కారణం తెలియలేదు. తేజాస్ గాయాలతో మరణించినట్లు అధికారులు చెబుతున్నారు. కునో నేషనల్ పార్క్‌లో మార్చి 27న తొలి చీతా మరణించింది. కిడ్నీల సమస్యతో సాషా అనే చీతా మరణించింది. తరువాత ఏప్రిల్‌లో ఒక చీతా గుండె సమస్యలతోనూ, మే ప్రారంభంలో ఒక చీతా ఇతర చీతాల దాడిలో మరణించాయి. మార్చిలో సియయ అనే చీతా నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. ఇందులో ఒకటి మేలోనూ, తరువాత అదే నెలలో కొన్ని రోజులకే మరో రెండు పిల్లలు మరణించాయి. ఈ మూడు చీతా పిల్లల మరణాలకు నీరసంగా ఉండటం, అధిక ఉష్ణోగ్రతలు కారణంగా చెబుతున్నారు. నమీబియా నుంచి భారత్‌కు తీసుకునివచ్చిన ఎనిమిది చీతాలను గత ఏడాది సెప్టెంబర్ 17న కునో నేషనల్ పార్క్‌లో ప్రవేశపెట్టారు. తరువాత ఈ ఏడాది ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికా నుంచి మరో 12 చీతాలను తీసుకుని వచ్చారు. ఇందులో ఆరు చీతాలు ప్రస్తుతం అడవిలో ఉండగా, మిగిలినవి కునోలోనే వివిధ ఎన్‌క్లోజర్లలో ఉన్నాయి.



మీకోసం

సగం కోసిన ఉల్లిపాయ ముక్కకు వెన్న రాసి ఉంచితే తాజాగా ఉంటుంది.

జీవన సారథం

జీవితంలో సవాళ్లను ఎదుర్కొని గెలిస్తే విజేతవవుతావు.. ఓడిపోతే దిశానిర్దేశకుడవవుతావు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్




పిల్లలూ, ఈ రోజు స్వాతంత్ర సమరయోధురాలు, బహుముఖ ప్రజ్ఞావంతురాలు, విద్యావేత్త దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి. దుర్గాబాయి దేశ్‌ముఖ్ రాజమండ్రిలో 1909 జులై 15న రామారావు, కృష్ణవేణమ్మ దంపతులకు జన్మించారు. 8 ఏళ్ల వయసులో మేనమామ సుబ్బారావుతో వివాహమైంది. అయితే దుర్గాబాయి ఆ వివాహాన్ని వ్యతిరేకించి చదువుకుంటానని చెప్పారు. ఆమె నిర్ణయాన్ని తండ్రి, సోదరుడు ఒప్పుకొని స్కూలుకు పంపించారు. పదేళ్ల వయసులోనే హిందీలో పాండిత్యాన్ని సంపాదించిన దుర్గ... ఆ తరువాత రాజమండ్రిలో బాలికా హిందీ పాఠశాలను ప్రారంభించి అన్ని వయసుల వారికీ విద్యాబోధన అందించారు.

బెనారస్ విశ్వవిద్యాలయం నుంచి మెట్రిక్యులేషన్, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ (పొలిటికల్ సైన్స్), 1942లో ఎల్.ఎల్.బి పూర్తిచేశారు. చిన్ననాటి నుంచే దేశభక్తి భావాలు గల దుర్గాబాయి స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచుకున్నారు. ఆంధ్రాలో పర్యటిస్తున్న గాంధీ హిందీ ఉపన్యాసాలను తెలుగులోకి అనువదించేవారు. గాంధీ రాకను పురస్కరించుకుని విరాళాలు సేకరించి ఇచ్చారు. తన వంతుగా చేతికి ఉన్న బంగారు గాజులు విరాళంగా ఇచ్చారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టు అయ్యారు కూడా.

అనేక మహిళా సంస్థలు, సాంఘిక సంక్షేమ సంస్థలను ఆమె ప్రారంభించారు. 1937లో చెన్నపట్నంలో ఆంధ్ర మహిళా సభ స్థాపించారు. 1941లో ఆంధ్ర మహిళ పత్రికను స్థాపించి, సంపాదకత్వం వహించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మహిళా వసతిగృహం ఏర్పాటుకు కృషి చేశారు. రాష్ట్రమంతటా ఎన్నో కళాశాలలు, వసతిగృహాలు, నర్సింగ్ హెూమ్‌లు, వృత్తి విద్యాకేంద్రాలు నెలకొల్పారు. 1953లో అప్పటి భారతదేశ ఆర్థికమంత్రి చింతామణి దేశ్‌ముఖ్‌తో ఆమెకు వివాహం జరిగింది. 1971లో ఆంధ్ర విశ్వవిద్యాలయం దుర్గాబాయికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. భారత రాజ్యాంగ నిర్మాణ సభలో 1946 నుంచి 1950 వరకు సభ్యురాలిగా పనిచేశారు. 1952లో ప్లానింగ్ కమిషన్ సభ్యురాలిగా ఉన్నారు. భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ బిరుదుతో సత్కరించింది. 1981 మే నెలలో ఆమె మరణించారు.

లెక్క చేయండి

పిల్లలూ ఇక్కడ కొన్ని బొమ్మలు ఇచ్చాం. సరైన అంకెలు రాస్తే.. ఎదురుగా ఉన్న జవాబులు వస్తాయి. చివరి జవాబు మీరే కనిపెట్టాలి మరి..



నేను గీసిన బొమ్మ






అడిగోపుల వైభవ్, ఆస్ట్రేలియా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పేదింటి జ్యోతి.. పరుగుల కీర్తి








పేదింటి అమ్మాయి ఆమె. తండ్రి కష్టపడితే వచ్చే అరకొర జీతమే ఆ కుటుంబం మొత్తానికీ ఆధారం. ఇటువంటి నేపథ్యంలో ఓ వైపు చదువుతూ.. మరోవైపు క్రీడల్లో రాణిస్తూ.. కుటుంబం మొత్తాన్నీ ఒడ్డుకు చేర్చాలని ఆ యువతి సంకల్పించింది. కష్టాలు.. ఆటుపోట్లు ఎదుర్కొంది. సరైన పౌష్టికాహారమూ దొరకని క్లిష్ట సమయంలో అరటి పండ్లునే తింటూ కఠోర సాధన చేసింది. కొద్దికాలానికే దేశం మెచ్చే గొప్ప క్రీడాకారిణిగా హార్డిల్స్‌లో తిరుగులేని మహారాణిగా ఎదిగింది. ఆమెనే మన తెలుగింటి అమ్మాయి.. యర్రాజి జ్యోతి.

గతంలో ఏ భారతీయ అథ్లెట్‌కూ సాధ్యంకాని ఘనతను తెలుగమ్మాయి యర్రాజి జ్యోతి సాధించింది. ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల 100 మీటర్ల హార్డిల్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన జ్యోతి ఆ పోటీల్లో స్వర్ణ పతకంతో మెరిసింది. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌లో గురువారం 100 మీటర్ల హార్డిల్ ఫైనల్ రేసును 13.09 సెకన్లలో ముగించి ఛాంపియన్‌గా అవతరించింది. 50 ఏళ్ల ఈ పోటీల చరిత్రలో 100 మీటర్ల హార్డిల్స్‌లో పసిడి పతకం గెలిచిన తొలి భారతీయ అథ్లెట్‌గా గుర్తింపు పొందింది. విశాఖ జిల్లాకు చెందిన ఆమె ఈ ప్రదర్శన ద్వారా వచ్చే నెలలో బుడాపెస్ట్‌లో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించింది.

జ్యోతి భువనేశ్వర్‌లోని రిలయన్స్ అథ్లెటిక్స్ హై పెర్ఫార్మెన్స్ సెంటర్‌లో ఇంగ్లండ్‌కు చెందిన కోచ్ జేమ్స్ హీలియర్ వద్ద శిక్షణ తీసుకుంటోంది. గత రెండేళ్లుగా ఆమె జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో నిలకడగా పతకాలు సాధిస్తోంది. వర్షం వల్ల తడిగా ఉన్న ట్రాక్‌పై జరిగిన తాజా ఫైనల్ రేసులోనూ జ్యోతి ఆద్యంతం ఒకే వేగంతో పరిగెత్తి అనుకున్న ఫలితం సాధించింది. భారత్ కీర్తిని వినువీధుల్లో రెపరెపలాడించింది.

ఆర్థిక ఇబ్బందులను అధిగమించి..

జ్యోతి విశాఖపట్నంలో 1999 ఆగస్ట్ 28న జన్మించింది. ఆమె తండ్రి సూర్యనారాయణ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు. తల్లి కుమారి గృహిణి. చిన్నతనం నుంచే జ్యోతికి క్రీడలంటే ఆసక్తి. ఆమెకు పరుగుపై ఉన్న ఆసక్తిని పిఇటి రెడ్డి తొలుత గుర్తించారు. సీనియర్ క్రీడాకారుడు గౌతమ్ జ్యోతికి తగు సలహాలు అందించారు. తల్లిదండ్రుల నుంచీ ఆమెకు ప్రోత్సాహం లభించింది. దీంతో పోర్టు హైస్కూలు గ్రౌండ్‌లోనూ, ఆ తరువాత గుంటూరులోనూ జ్యోతి కఠోర సాధన చేసింది.



2015లో రాష్ట్రంలోని అంతర్ జిల్లాల మీట్‌లో బంగారు పతకాన్ని గెలుచుకుని అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆ తరువాత ఆమె పలు జూనియర్, సీనియర్ జాతీయ మీట్‌లలో పతకాలు సాధించింది. అయితే, తండ్రికి నెలంతా కష్టపడితే ఏడెనిమిది వేలు రాని దుస్థితి. దీంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండటం చూసిన జ్యోతి ఎంతో ఆవేదనకు గురయ్యేది. ఎలాగైనా కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచాలని భావించింది. నాడు ప్రారంభమైన పరుగును ఎన్నడూ ఆపలేదు. పాల్గొన్న ప్రతి పోటీలోనూ సత్తా చాటుతూ వస్తోంది.

పట్టుదల.. మెరుగైన శిక్షణ

వాస్తవానికి జ్యోతి 2015లో అథ్లెటిక్స్ క్రీడలో ప్రవేశించింది. నిరంతర కఠోర సాధనతో రాటుదేలింది. రాష్ట్ర స్థాయిలో పతకాల పంట మోగించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆమె ఆటను చూసిన సీనియర్ అథ్లెట్ సాయిగౌతమ్ మరింత ప్రోత్సహించారు. అనంతరం మరింత మెరుగైన శిక్షణ కోసం హైదరాబాద్‌లోని సాయ్ సెంటర్‌లో చేరింది. 2018 వరకూ అక్కడ నిష్ణాతులైన కోచ్‌ల వద్ద తర్ఫీదు పొందింది. ప్రస్తుతం భువనేశ్వర్‌లోని రిలయన్స్ అథ్లెటిక్స్ హై పెర్ఫార్మెన్స్ సెంటర్‌లో శిక్షణ పొందుతూ ముందుకు సాగుతోంది.

ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా..

తన ఉన్నతికి తల్లిదండ్రులు పడిన కష్టాలు నిత్యం జ్యోతి కళ్ల ముందు కదలాడుతున్నాయి. ఒలింపిక్స్‌లో పతకం సాధించి తల్లిదండ్రుల రుణం తీర్చుకుంటానంటోంది. ఆమె క్రీడా ప్రతిభ తెలిసిన వారెవరిని కదిపినా తను మరింత ఉన్నత శిఖరాలను అందుకుంటుందనే విశ్వాసాన్నే వ్యక్తం చేస్తున్నారు. 'జ్యోతి ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో రికార్డు నెలకొల్పుతుందని మాకు తెలుసు. మా నమ్మకాన్ని ఆమె వమ్ము చేయలేదు. త్వరలో ఆమె చైనాలో జరిగే ఏషియన్ గేమ్స్, వచ్చే ఏడాది పారిస్‌లో జరిగే ఒలింపిక్స్‌లోనూ సత్తా చాటుతుంది' అని ఎపి అథ్లెటిక్ అసోసియేషన్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్ ఎం.నారాయణరావు 'ప్రజాశక్తి'తో అన్నారు. ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో జ్యోతి 100 మీటర్ల హార్డిల్స్‌లో స్వర్ణ పతకం సాధించడంపై సిఎం జగన్మోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 'జ్యోతీ, 25వ ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించి రికార్డును అందుకున్నావు. మీ ప్రదర్శనతో అందరినీ గర్వపడేలా చేశావు..' అంటూ ట్వీట్ చేశారు.

జాతీయ స్థాయిలో బోలెడు పతకాలు

జ్యోతి ఈ ఏడాది ఏప్రిల్‌లో కజికిస్థాన్‌లో జరిగిన ఏషియన్ ఇండోర్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటి రజిత పతకం గెలుపొందింది. ఆమె 60 మీటర్ల హార్డిల్స్‌ను 8.10 సెకన్లలో పూర్తి చేసి ఈ ఘనత సాధించింది. హార్డిల్స్‌తో పాటు 100, 200 మీటర్ల పరుగులో సైతం పతకాలు గెలుపొందింది. జార్ఖండ్‌లో ఈ ఏడాది మే 15 నుంచి 18 వరకూ జరిగిన ఫెడరేషన్ కప్ జాతీయ స్థాయి పోటీల్లో 100, 200 మీటర్ల హార్డిల్స్‌లోనూ విజేతగా నిలిచింది. 100 మీటర్ల హార్డిల్స్‌లో 12.89 సెకన్లలో పరుగుతీసి కొత్త రికార్డు నెలకొల్పింది. జాతీయ స్థాయిలోనే ఇప్పటివరకూ జ్యోతి 35కిపైగా పతకాలు సాధించింది.

- కోడూరు అప్పలనాయుడు,
94915 70765

'పంచాయతీ' హింసకు వ్యతిరేకంగా

లెఫ్ట్ ఫ్రంట్, మిత్రపక్షాల నిరసన

- పెద్ద ఎత్తున పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు
- పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్, బిజెపిలపై ఆగ్రహం

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ పంచాయతీ ఎన్నికల్లో పెద్ద ఎత్తున జరిగిన హింస, రిగ్గింగ్, దాడులకు వ్యతిరేకంగా లెఫ్ట్ ఫ్రంట్, దాని మిత్రపక్షాలు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాయి. ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. ఎస్ప్లనేడ్‌లోని లెనిన్ విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ సెంట్రల్ కోల్‌కతాలోని ఎంటాలి మార్కెట్‌లో ముగిసింది. అధికార తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష బిజెపి హింసాత్మక మోసపూరిత చర్యలపై లెఫ్ట్‌ఫ్రంట్, దాని మిత్రపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. లెఫ్ట్ ఫ్రంట్ చైర్మెన్ బిమన్ బోస్, సిపిఎం నాయకులు మహ్మద్ సలీం, సూర్యకాంత మిశ్రా, సుజన్ చక్రవర్తి, ఐఎస్‌ఎఫ్ ఎమ్మెల్యే నౌషాద్ సిద్ధిఖీ, కాంగ్రెస్, ఫార్వర్డ్ బ్లాక్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ, సీపీఐ నాయకులు నిరసన ర్యాలీకి నాయకత్వం వహించారు. పాదయాత్రగా బయలుదేరారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సలీం మాట్లాడుతూ... "ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నకిలీ సర్టిఫికెట్లతో తొలి ఎన్నికల్లో పోరాడారు. దేశ ప్రధాని కూడా నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి అధికారంలోకి వచ్చారు. పంచాయతీ ఎన్నికలకు కూడా నకిలీ సర్టిఫికెట్లు తయారు చేయడం ద్వారా అధికారాన్ని తృణమూల్ చేజిక్కించుకుంటున్నది. కానీ బెంగాల్ ప్రజలు నకిలీ సర్టిఫికెట్లపై సృష్టించిన పంచాయతీని అంగీకరించరు" అని తెలిపారు.

ఎన్నికల్లో బిజెపి వ్యవహారం పైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఆరెస్సెస్.. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ద్వారా డబ్బుతో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసింది. త్రిపుర, గుజరాత్, మధ్యప్రదేశ్, అసోం, యూపీ సహా ఆరెస్సెస్ ద్వారా నడుస్తున్న రాష్ట్రాలకు ఆమె వెళ్తుంది. మళ్లీ బెంగాల్ విభజన జరగాలని యోచిస్తున్నారు. కూచ్ బెహార్ నుంచి ఉత్తర బెంగాల్‌ను ప్రత్యేక రాష్ట్రంగా చేయాలని బిజెపి కోరుకుంటోంది. బెంగాల్‌ను మళ్లీ విభజించాలనే ఈ కుట్రకు వ్యతిరేకంగా బెంగాల్ ప్రజలు నిలబడతారు" అని ఆయన అన్నారు. పలువురు లెఫ్ట్ ఫ్రంట్ నేతలు ఒకదాని తర్వాత మరొకటిగా కౌంటింగ్ కేంద్రాల్లో జరిగిన అవకతవకలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌ఎఫ్ ఎమ్మెల్యే నౌషాద్ సిద్ధిఖీ తదితరులు ప్రసంగించారు. కాగా పంచాయతీ ఎన్నికల హింసలో మరణించిన అన్ని రాజకీయ పార్టీలకు చెందిన 49 మంది కార్యకర్తలు, సామాన్య ప్రజలకు లెఫ్ట్ ఫ్రంట్ నివాళు లర్పించింది. కోల్‌కతాతో పాటు, ఉత్తర మరియు దక్షిణ 24 పరగణాలు, హౌరా, హుగ్లీ నుంచి చాలా మంది ప్రజలు ఈ నిరసన ర్యాలీలో పాల్గొన్నారు.

వీధుల్లో దొరికిన సిపిఎం గుర్తుపై ఓటువేసిన బ్యాలెట్ పత్రాలు



పశ్చిమబెంగాల్‌లోని తూర్పు బుర్ద్వాన్‌లో ఓ బ్లాక్‌లోని కౌంటింగ్ కేంద్రం దగ్గర పడి ఉన్న సిపిఐ(ఎం) ఓట్లను గుర్తించారు. తూర్పు బుర్ద్వాన్‌లోని ఈ బ్లాక్‌కు సంబంధించిన కౌంటింగ్‌పటులి కిషన్ మండిలో జరిగింది. ఓట్ల లెక్కింపు అనంతరం కిషన్ మండి గోడల పక్కన పడి ఉన్న బ్యాలెట్ పత్రాల దొంతరలను గుర్తించారు. బ్యాలెట్ పేపర్లలో సిపిఎం గుర్తు సుత్తి కొడవలి నక్షత్రంపై ఓటరు ముద్రలను స్థానికులు గుర్తించారు. సీపీఐ(ఎం) స్థానిక నాయకులు మాట్లాడుతూ... ప్రతి బ్యాలెట్ పేపర్‌పైనా ప్రిసైడింగ్ అధికారి సంతకం ఉంటుంది. ఓటు వేసేటప్పుడు బ్యాలెట్ పేపర్‌పై సంతకం చేస్తారు. ఈ బ్యాలెట్ పత్రాలు కరిగర్ పారాలోని పూర్వస్థలి గ్రామ పంచాయతీలోని బూత్ నంబర్ 228కి చెందినవిగా వారు పేర్కొన్నారు. ఇక్కడనుంచి సిపిఎం అభ్యర్థిగా పోటీచేసిన మరియా బిబి షేక్ కేవలం మూడు ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారని సిపిఎం నాయకులు తెలిపారు.

సిపిఎం, కాంగ్రెస్, ఐఎస్‌ఎఫ్‌లు నామినేషన్‌లు వేసిన నాటి నుంచే దోపిడీ ప్రక్రియ మొదలైందన్నారు. ఈ దోపిడీ ప్రక్రియలో తృణమూల్‌తో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా పాలుపంచుకుందని వారు ఆరోపించారు. ప్రతిపక్షాల అభ్యర్థులకు అనుకూలమైన ఓట్లను బయటకు విసిరేశారని, అయినప్పటికీ ప్రతిపక్ష అభ్యర్థులు గెలిచిన చోట సర్టిఫికెట్ ఇవ్వలేదని అన్నారు. తణమూల్ డిమాండ్ మేరకు ప్రతిపక్ష ఏజెంట్లను బహిష్కరించి మళ్లీ కౌంటింగ్ చేపట్టారని, ఆ తర్వాత తృణమూల్ అభ్యర్థులను విజేతలుగా ప్రకటించారని అన్నారు.

సిపిఎం పూర్వస్థలి-2 ఏరియా కమిటీ సభ్యుల్లో ఒకరైన కార్తీక్ దాస్ మాట్లాడుతూ... ఇలాంటి ఘటనలు జరుగుతాయని మేం ముందే ఊహించాం. ఓట్ల లెక్కింపు రోజున బ్యాలెట్ బాక్సులను తీసుకురావడానికి తాత్కాలిక ఉద్యోగులను ఉపయోగించవద్దని పూర్వస్థలి-2 బిడిఒను కోరాం. అయినా... ఆయన మా విజ్ఞప్తిని అంగీకరించలేదని కార్తీక్ దాస్ తెలిపారు.

ఇండియా 421డిక్లేర్డ్

వెస్టిండీస్‌తో తొలిటెస్ట్



డొమినిక: వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలిటెస్ట్‌లో అరంగేట్రం యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్(171) భారీ శతకానికి తోడు మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి(76) అర్ధసెంచరీలతో మెరిసాడు. దీంతో భారతజట్టు మూడోరోజు 5వికెట్ల నష్టానికి 421పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. లంచ్ సమయానికి 4వికెట్ల నష్టానికి 400 పరుగులు చేసిన టీమిండియా.. ఆ తర్వాత విరాట్ కోహ్లి ఔటయ్యాక రోహిత్ శర్మ ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేశాడు. ఆ సమయానికి క్రీజ్‌లో జడేజా(37) ఇషాన్ కిషన్(1) ఉన్నారు. దీంతో భారతజట్టుకు 271పరుగుల ఆధిక్యత లభించింది. ఓవర్ నైట్ బ్యాటర్ జైస్వాల్ డబుల్ సెంచరీ దిశగా వెళ్లే క్రమంలో జోసెఫ్ బౌలింగ్‌లో డి-శిల్వకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ జట్టు టీ విరామ సమయానికి 2వికెట్ల నష్టానికి 32పరుగులు చేసింది.

వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: 150పరుగులు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)డి-శిల్వ (బి)జోసెఫ్ 171, రోహిత్ (సి)డి-శిల్వ (బి)అథంజే 103, శుభ్‌మన్ (సి)అథంజే (బి)వర్రికన్ 6, కోహ్లి (సి)అథంజే (బి)కార్న్‌వాల్ 76, రహానే (సి)బ్లాక్‌వుడ్ (బి)రోచ్ 3, జడేజా (నాటౌట్) 37, ఇషాన్ (నాటౌట్) 1, అదనం 24. (152.2ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 421పరుగులు. **వికెట్ల పతనం:** 1/229, 2/240, 3/350, 4/356, 5/405 **బౌలింగ్:** రోచ్ 24-6-50-1, జోసెఫ్ 18.2-2-80-1, కార్న్‌వాల్ 16-5-32-1, వర్రికన్ 45-4-106-1, హోల్డర్ 18-5-40- 0, బ్రాత్‌వైత్ 9-0-21-0, అథంజే 16-2-53-1, రీఫర్ 4-0-16-0, బ్లాక్‌వుడ్ 2-0-4-9.

ఫైనల్‌కు జకో, అల్కరాజ్

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి టాప్‌సీడ్, స్పెయిన్‌కు చెందిన అల్కరాజ్, 2వ సీడ్, సెర్బియాకు చెందిన 36ఏళ్ల నొవాక్ జకోవిచ్ ప్రవేశించారు. శుక్రవారం జరిగిన తొలి సెమీస్‌లో జకోవిచ్ 6-3, 6-4, 7-6(7-4)తో 8వ సీడ్ జన్నిక్ సిన్నర్(ఇటలీ)ను, కార్లోస్ అల్కరాజ్ 6-3, 6-3, 6-3తో 3వ సీడ్, రష్యాకు డానియెల్ మెద్వదెవన్‌ను వరుససెట్లలో ఓడించారు. తొలి సెమీస్‌లో తొలి రెండు సెట్‌లను సునాయాసంగా నెగ్గిన జకోవిచ్‌కు మూడో సెట్‌లో అనూహ్యంగా ప్రతిఘటన ఎదురైంది. ఆ సెట్‌ను టై బ్రేక్‌కు దారితీసింది. దీంతో చివర్లో వరుసగా మూడు పాయింట్లు సాధించి జకోవిచ్ మ్యాచ్‌ను ముగించాడు. దీంతో వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో 9వ సారి ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 2013లో మాత్రమే రన్నర్‌గా నిలిచిన జకోవిచ్.. ఫైనల్‌కు చేరిన ప్రతి సందర్భంలోనూ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. 2011, 2014, 2015, 2018, 2019, 2021, 2022లలో వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను ముద్దాడా డు. పురుషుల సింగిల్స్‌లో 23 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గి జకోవిచ్ నయా చరిత్రను నెలకొల్పాడు. అల్కరాజ్ గత ఏడాది యుఎస్ ఓపెన్ ఫైనల్లో జకోవిచ్‌ను ఓడించి తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను గెలిచాడు. ఆదివారం జరిగే ఫైనల్లో జకోవిచ్, అల్కరాజ్ టైటిల్‌కై తలపడనున్నారు.

నేడు మహిళల సింగిల్స్ ఫైనల్..

మహిళల సింగిల్స్ ఫైనల్ శనివారం జరగ నుంది. 6వ సీడ్, ట్యునీషియాకు చెందిన జబీర్, అన్‌సీడెడ్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన వోండ్రోసోవాల మధ్య టైటిల్‌పోరు జరగనుంది. సెమీస్‌లో జబీర్ 6-7(5-7), 6-4, 6-3తో 2వ సీడ్ సబలెంకను, వోండ్రోసోవా 6-3, 6-3తో అన్‌సీడెడ్, ఉక్రెయి న్‌కు చెందిన స్విటోలినా ఓడించి ఫైనల్‌కు చేరారు.

63 ఏళ్ల తరువాత హాలీవుడ్ మూత



హాలీవుడ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కలకలం సృష్టిస్తోంది. తమ భవిష్యత్తుకు భరోసా కల్పించాలని, రెమ్యూనరేషన్లు పెంచాలని, ఏఐ నుంచి పొంచి ఉన్న ముప్పును తప్పించాలని డిమాండ్ చేస్తూ హాలీవుడ్‌కు చెందిన 'ది స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్' సమ్మెకు దిగింది. గురువారం అర్ధరాత్రి నుంచి గిల్డ్‌లో ఉన్న లక్షా 60 వేల మంది నటీనటులు సమ్మెబాట పట్టారు. ఇవే డిమాండ్లతో గత 11 వారాలుగా రైటర్స్ గిల్డ్ ఆఫ్ అమెరికా సమ్మెకు దిగింది. తాజాగా వారికి నటీనటులు తోడవడంతో హాలీవుడ్ సినీ పరిశ్రమ మూతపడినట్లయింది. ఇలా రచయితలు, నటులు ఒకేసారి సమ్మెకు దిగడం గత 63 ఏళ్లలో ఇదే తొలిసారి.

హాలీవుడ్‌లో మొదటిసారిగా 1960లో నటుడు రోనాల్డ్ రీగన్ నేతత్వంలో రెండు యూనియన్లు డబుల్ స్ట్రైక్ చేశాయి. 1980లో స్క్రీన్ యాక్టర్స్ సమ్మె జరిగింది. ఇన్నేళ్ల తర్వాత రైటర్స్ గిల్డ్, స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్ కలిసి మరోసారి డబుల్ స్ట్రైక్ చేస్తున్నాయి. ఈసారి 98 శాతం మంది నటీనటులు ఈ సమ్మెకు మద్దతు తెలపడం విశేషం. ఈ సమ్మెతో హాలీవుడ్‌లో తెరకెక్కుతున్న సినిమాలు, టీవీ సిరీస్‌లు ఆలస్యం కానున్నాయి.

రాజ్‌ఘాట్‌లోకి యమునా వరద నీరు



న్యూఢిల్లీ : దేశరాజధాని నగరం న్యూఢిల్లీలో యమునా వరద ఉధృతి కొనసాగుతూనేవుంది. రాజ్‌ఘాట్‌లోని మహాత్మా గాంధీ స్మారకంలోకి వరద నీరు ప్రవేశించింది. అక్కడి పచ్చిక బయళ్లను ముంచెత్తింది. రాజ్‌ఘాట్‌లోకి వరదనీరు ప్రవేశించిన చిత్రాలను గాంధీ స్మృతి అండ్ దర్శన్ సమితి వైస్ చైర్మన్ విజయ్ గోయల్ ట్వీట్ చేశారు. రింగ్ రోడ్డును దాటుకుంటూ వచ్చిన వరద నీరు అక్కడ నుంచి రాజ్‌ఘాట్‌లోకి చేరుకున్నాయి. ఈ విషయంపై ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ విలేకరులతో మాట్లాడుతూ ఆ ప్రాంతంలోని డ్రెయిన్ నుంచి బ్యాక్‌ఫ్లో కారణంగా రాజ్‌ఘాట్‌లోకి వరద నీరు ప్రవేశించిందని చెప్పారు. ఢిల్లీలోని యమునా నది పశ్చిమ ఒడ్డున రాజ్‌ఘాట్ 44.35 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. 1948లో మహాత్మా గాంధీ అంత్యక్రియలు జరిగిన ప్రదేశంలోనే ఆయన స్మారకాన్ని నిర్మించారు.

వరద నీటిలో మునిగి ముగ్గురు బాలురు మృతి

ఢిల్లీలోని యమునా నది వరద నీటిలో మునిగి ముగ్గురు బాలురు మృతి చెందారు. ముకుంద్‌పూర్ చౌక్ ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం ఈ దారుణం జరిగింది. మెట్రో నిర్మాణ స్థలంలో చేరుకున్న వరద నీటిలో స్నానం చేయడానికి దిగిన ఈ బాలురు ప్రమాదవశాత్తూ మృతి చెందినట్లు అధికారులు చెప్పారు. మృతుల్ని ఈశాన్య ఢిల్లీకి చెందిన నిఖిల్ (10), పియూష్ (13), ఆశీష్ (13)గా గుర్తించారు.

షాట్‌పుట్‌లో తేజిందర్‌కు స్వర్ణం

బ్యాంకాక్: ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షాట్ పుటర్ తేజిందర్‌పాల్ సింగ్ తూర్ అదరగొట్టా డు. వరుసగా రెండోసారి బంగారు పతకం సాధించాడు. తొలి ప్రయత్నంలోనే షాట్‌పుట్‌ను 20.23 మీటర్ల దూరం విసిరాడు. ఇరాన్‌కు చెందిన సబేరి మెహ్దీ(19.98 మీటర్లు), కజకిస్థాన్ అథ్లెట్ ఇవన్ ఇవనోవ్ (19.87 మీటర్ల) రజిత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తేజిందర్‌పాల్‌కు ఘనమైన రికార్డు ఉంది. 2019లో అతను 20.22 మీటర్లతో స్వర్ణం సాధించాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68